సాగునీటి సౌకర్యం అంతగా లేక, ఉపాధి అవకాశాలు కరువై శతాబ్దాల కాలంగా బతుకుదెరువు కోసం పొరుగు రాష్ట్రాలు, జిల్లాలకు వలసలు వెళ్తున్న జిల్లాలోని పశ్చిమప్రాంత ప్రజల భవిష్యత్ ఆశాజనకంగా కనిపిస్తోంది. సాగు, తాగునీటి సౌకర్యాలు, పారిశ్రామిక.. ఇతర మౌలిక రంగాలైన విద్య, వైద్యం, రోడ్లు, రైల్వే సౌకర్యాల పెంపునకు కూటమి ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధమైన చర్యలు సాగుతున్నాయి. అందులో అత్యంత కీలకమైన పారిశ్రామిక వెలుగులకు బుధవారం పునాది పడుతోంది. వెనుకబాటు, వలసలు అధికంగా ఉన్న కనిగిరి నియోజకవర్గంలో ఇందుకు తొలి అడుగుగా రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ స్థాపించనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్లలో మొదటిది ఏర్పాటు కానుంది.


పీసీపల్లి మండలం దివాకరపల్లి వద్ద సిద్ధం చేసిన సభా వేదిక





భవిష్యత్‌కు భరోసా

పశ్చిమప్రాంతంలో పారిశ్రామిక వెలుగులకు నేడు పునాది

- దివాకరపల్లి వద్ద రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ
- హాజరుకానున్న మంత్రి లోకేష్, అనంత్ అంబానీ, మంత్రులు
- జిల్లాలో మరో నాలుగు కూడా ఏర్పాటు
- ఇంకోవైపు అల్ట్రా మెగా సోలార్ ప్లాంట్లు
- నిమ్జ్, దొనకొండ కారిడార్‌లను కదిలిస్తే ప్రగతి పరుగు
- వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కీలకం
- ట్రిపుల్ ఐటీ, మెడికల్ కాలేజీ నిర్మాణాలూ అవసరం

ఒంగోలు ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రూ.65వేల కోట్లతో 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ, ప్రభుత్వానికి మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. పెద్దఎత్తున భూములు ఇందుకు అవసరం కాగా మన జిల్లాలో విస్తారంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములు అందుబాటులో ఉండటం కలిసొచ్చింది. రిలయన్స్ ప్రాజెక్టు రాష్ట్రానికి రావడానికి ప్రధాన కారణం మంత్రి నారా లోకేష్ కాగా.. ఆయన తొలి ప్లాంట్ కనిగిరి ప్రాంతంలో ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ల చొరవ కూడా అందుకు ఉపకరించింది. కాగా రాష్ట్రంలో 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించిన రిలయన్స్ అందులో కనీసం నాలుగింటిని జిల్లాలో స్థాపించనుంది. ఆ మేరకు ప్రభుత్వం ఇచ్చిన సంకేతాలతో జిల్లా యంత్రాంగం కనిగిరి నియోజకవర్గం, మార్కాపురం పరిధిలోని కొనకనమిట్ల మండలాల్లో ఇప్పటికే 4,900 ఎకరాల భూమిని గుర్తించారు. తొలిగా పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో 459 ఎకరాలలో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి బుధవారం రాష్ట్రమంత్రి నారా లోకేష్, రిలయన్స్ సంస్థ అధిపతి ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ భూమిపూజ చేయనున్నారు.

పర్యావరణ హిత ప్రాజెక్టు

పర్యావరణ, ఇతరత్రా సమస్యలు లేకుండా బీడు భూముల్లో బయోగ్యాస్ ఉత్పత్తికి ఉపయోగించే గడ్డి పెంపకం చేపడతారు. దానిని కట్ చేసి గ్యాస్ తయారు చేస్తారు. గడ్డి పెంపకం కోసం భూములిచ్చే రైతుల్లో పట్టాదారులకు

మిగతా 4వ పేజీలో



దివాకరపల్లి వద్ద ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, అధికారులు


పైడిపాడులో లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా పింఛన్‌ల పంపిణీ

- పైడిపాడులో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర చోట్ల ముఖ్యనేతలు, అధికారులు హాజరు
- ఇంటింటికీ వెళ్లి అందజేసిన సిబ్బంది

ఒంగోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. ఉదయం ఏడు గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు మొత్తాలు అందజేయడం ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2,83,217 మంది లబ్ధిదారులకు వివిధ కేటగిరీలలో రూ.124.5 కోట్ల నగదు మంజూరు కాగా ఉదయం పది గంటలకే 60శాతం మందికి పంపిణీ చేశారు. సాయంత్రం ఐదు గంటలకు 89శాతంతో 2,52,013 మందికి రూ.189.28 కోట్ల మొత్తాన్ని అందజేశారు. అందుబాటులో ఉన్న వారికి రాత్రి కూడా ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా మంత్రి నుంచి గ్రామస్థాయిలోని టీడీపీ నాయకుల వరకు.. అలాగే జిల్లా మండల స్థాయి అధికారులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని జరుగుమల్లి మండలం పైడిపాడులో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్రం తీవ్ర అప్పుల్లో ఉన్నా పేదల సంక్షేమం కోసం ప్రతినెలా 1న రూ.2,722 కోట్లను 63 లక్షల మంది పింఛన్‌దారులకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ4 సర్వేను సీఎం ప్రారంభించారన్నారు. కాగా ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మంగళవారం ఉదయం ఎన్‌జీపాడు మండలం చేకూరపాడు, ఉప్పుగుండూరులలో పింఛన్లు పంపిణీ చేశారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పీసీపల్లి మండలం వెంగళాయపల్లిలో పాల్గొన్నారు. టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు వైపాలెంలోనూ, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ముండ్లమూరు మండలంలో అందజేశారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు దర్శి పట్టణంలో పంపిణీ చేశారు. పలు మండలాలు, పట్టణాలలో స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి టీడీపీ ముఖ్య నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.


కొత్తగొల్లపాలెంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే ఏలూరి

దాతలకు ప్రేరణ.. పేదలకు చేయూత

- పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి నిర్దిష్ట హామీలు
- పాలన, పార్టీ వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఏలూరికి కితాబు
- గొల్లపాలెంలో వినూత్నంగా సాగిన సీఎం చంద్రబాబు కార్యక్రమం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమ నిర్వహణలో కీలకమైన దాతలకు ప్రేరణ, పేదలకు భరోసానివ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కొత్తగొల్లపాలెం కార్యక్రమం సఫలీకృతమైంది. గతంలో వలే భారీ ప్రసంగం లేకుండా నిర్దిష్ట విధానంతో నిర్వహించడం ప్రజలకు ఉల్లాసాన్నిచ్చింది. గ్రామంలో పూర్తి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల స్థితిగతులను వారి ద్వారానే బహిరంగపర్చి చేయూతనిచ్చే దాతలకు ప్రేరణనిచ్చేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేసందర్భంగా నియోజకవర్గంలో పార్టీ, పాలనాపరమైన వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఏలూరి పాత్రకు చంద్రబాబు కితాబిస్తూ ఆయన ఇచ్చిన సమస్యల చిట్టా చదువుతూనే కొన్ని పనులకు నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. మరికొన్నింటిని దాటవేశారు. తొలుత సీఎం హోదాలో గ్రామస్థులతో మమేకమైన ఆయన చివర్లో పార్టీ అధినేత హోదాలో శ్రేణులతో మమేకమయ్యారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలోని కొత్తగొల్లపాలెంకు చంద్రబాబు వచ్చారు.

పీ-4 కార్యక్రమంపై అవగాహన

గతంలో వలే పింఛన్ల పంపిణీకే చంద్రబాబు పరిమితం కాకుండా కొత్తగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం తీరుతెన్నులను ప్రజలకు తెలిపే ప్రయత్నం చేశారు. గ్రామంలో 996 మంది ఉండగా అందులో 17మందికి

మిగతా 4వ పేజీలో

చెన్నయ్య భూమి హాంఫట్

- 11.67 ఎకరాలు ఆక్రమణ
- దాని విలువ రూ.5 కోట్లు!
- వ్యవసాయ భూమిలో కలిపేసుకున్న కబ్జాదారులు
- చోద్యంచూస్తున్న అధికారులు

మార్కాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల భూముల ఆక్రమణలు మార్కాపురం డివిజన్‌లో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఆలయ భూములను కబ్జా చేసి అమ్ముకునేది కొందరైతే వ్యవసాయ క్షేత్రాలను ఆనుకుని ఉన్న మాన్యాలను ఇష్టారీతిన కలిపేసుకునేవాళ్లు మరికొందరు ఉన్నారు. ఒక వైపు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి దేవుని భూములను ఒక్కొక్కటిగా ఆక్రమణల చెర నుంచి విడిపిస్తోంది. అయినా కబ్జాలకు అలవాటుపడ్డ వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. ఆక్రమణల పర్వం కొనసాగిస్తూనే ఉన్నారు. ఆలయాల ఆస్తులను పరిరక్షించాల్సిన దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం భూ బకాసురులకు వరంగా మారుతోంది. దీంతో దేవుని భూములు ఇష్టారీతిన అన్యాక్రాంతమవుతున్నాయి.

ఎర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలేనికి చెందిన చెన్నకేశవస్వామి ఆస్తులు కూడా ఇదేవిధంగా కబ్జాదారుల కంబంధ హస్తాల్లో ఉన్నాయి. పెద్దారవీడు మండలంలో రూ.5 కోట్ల విలువైన 11.67 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి.


ఆక్రమణకు గురైన ఆలయ భూమి

రికార్డులున్నా.. ఆక్రమణల చెరలోనే

పెద్దారవీడు మండలంలోని కంభంపాడు గ్రామ సర్వేనంబరు 35లో 4.31 ఎకరాలు, సర్వేనంబర్ 75లో 7.36 ఎకరాలు వెరసి 11.67 ఎకరాలు వెంకటాద్రిపాలెం చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన భూమి ఉంది. అవి రెవెన్యూ రికార్డుల్లో కూడా దేవస్థానానికి చెందిన భూములుగానే నమోదయ్యాయి. ఖాతా నెంబర్ 721లో ఈ భూములు దేవదాయశాఖ పేరుతోనే

మిగతా 4వ పేజీలో

అభివృద్ధికి పన్నులే ఆధారం..!

- వసూళ్లలో మునిసిపాలిటీలు పురోగతి
- కలిసొచ్చిన 50శాతం వడ్డీ రాయితీ
- ప్రథమ స్థానంలో చీమకుర్తి
- అట్టడుగున పొదిలి
- గతేడాది కంటే రూ.10 కోట్ల అదనపు ఆదాయంలో ఒంగోలు
- జిల్లాలో రూ. 77.41 కోట్ల డిమాండ్.. రూ. 52.74 కోట్లు వసూలు



ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో కీలక ఆదాయ వనరైన ఆస్తి పన్ను వసూళ్లలో జిల్లా ప్రగతి సాధించి పర్వాలేదనిపించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మునిసిపాలిటీలు పోటీపడి మరీ లక్ష్యాలకు చేరువయ్యాయి. గతేడాదితో పోలిస్తే దాదాపు అన్ని మునిసిపాలిటీలు, ఒంగోలు కార్పొరేషన్ ముందంజలోనే ఉన్నాయి. మొత్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, చీమకుర్తి, దర్శి, పొదిలి మునిసిపాలిటీలు నూరుశాతం వసూలు లక్ష్యంగా ముందుకు సాగాయి. అయితే గతనెల పదో తేదీ వరకు నత్తనడకన పన్నుల వసూలు జరిగింది. అయితే ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటించడంతో అందుకు

మిగతా 4వ పేజీలో

గత వైసీపీ పాలనలో పేరుకుపోయిన బకాయిలు

గత వైసీపీ ప్రభుత్వం పట్టణాల ప్రగతి గురించి పట్టించుకోకపోవడంతో పెద్దమొత్తంలో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. దీంతో నిన్న మొన్నటి వరకు పురపాలక సంస్థల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. వాస్తవానికి ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నిధుల (జనరల్ ఫండ్)తో రోడ్లు, డ్రైన్లు, భవనాల నిర్మాణం, ప్రహరీగోడలు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగు, తాగునీటి సరఫరా నిర్వహణ, కొత్తగా పైపులైన్లు, పాత వాటికి మరమ్మతులు, మరుగుదొడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి చేయాల్సి ఉంది. గత పాలకులు పారిశుధ్యం, తాగునీటి సరఫరాకే పరిమితమయ్యారు. దీంతో ఉన్న నిధులు కాస్తా కరిగిపోయి ఖజానా ఖాళీ అయ్యింది. తాజాగా ప్రభుత్వం వడ్డీరాయితీ అవకాశం ఇవ్వడంతో ఒంగోలు నగరం, ఇతర పట్టణాలకు కొంత ఊరట లభించింది.


చీమకుర్తి మునిసిపల్ కార్యాలయం



కేతగుడిపి సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

పింఛన్ సొమ్ము మాయం!

పోలీసులకు ఫిర్యాదు చేసిన కేతగుడిపి వెల్ఫేర్ అసిస్టెంట్

తర్లుపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేతగుడిపి, బుడ్డపల్లెకు సంబంధించిన పింఛన్ల సొమ్ము రూ.15.36లక్షలు మాయమయ్యాయి. ఈమేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లిక మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 407 పింఛన్ లబ్ధిదారులకు సంబంధించి రూ.17.78 లక్షలను శనివారం మధ్యాహ్నం వెల్ఫేర్ అసిస్టెంట్ మార్కాపురం డ్రా చేశారు. కేతగుడిపిలో పంపిణీ చేసేందుకు అక్కడి డిజిటల్ అసిస్టెంట్ ఎ.సతీష్‌రెడ్డికి రూ.2.42లక్షలు

మిగతా 4వ పేజీలో

పింఛన్ సొమ్ము మాయం

(3వ పేజీ తరువాయి

బ్యాంకు వద్ద అందజేశారు. మిగిలిన రూ.15.36లక్షలు తీసుకుని ఇంటికి వెళ్తుండగా ఆటోలో మర్చిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు రోజుల నుంచి నగదు పోయిన విషయాన్ని ఎవరికీ చెప్పకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ జాగ్రత్త పడ్డారు. మంగళవారం ఉదయం కేతగుడిపిలో పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 10 గంటల వరకు ప్రారంభించలేదు. దీంతో జిల్లా అధికారుల నుంచి ఎంపీడీవోకు ఫోన్ వచ్చింది. ఆయన ఎందుకు పంపిణీ చేయలేదని వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికను అడిగారు. శనివారం ఆటోలో నగదు పోయినట్లు ఎంపీడీఓవోకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ ఉదయం 11 గంటలకు మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇప్పటి వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు...?

రూ.15.36లక్షలు నగదు ఆటోలోపోతే మంగళవారం వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదంటూ పోలీసులు వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. బ్యాంకులో ఎన్ని గంటలకు నగదు డ్రా చేసింది, ఎన్ని గంటలకు ఆటోలో వెళ్లింది, ఎన్ని గంటలకు ఇంటికి వెళ్లిందన్న విషయమై ఆరా తీశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. సీసీ టీవీల ఫుటేజీని పరిశీలిస్తున్న ఆయన చెప్పారు.

నగదు పోయిన విషయం నాకు చెప్పలేదు : చక్రపాణి ప్రసాద్, ఎంపీడీవో

పింఛన్ల నగదు మూడు రోజుల క్రితం ఆటోలో పోతే తనకు ఉదయం వరకు సమాచారం ఇవ్వలేదని ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. డీఆర్‌డీఏ నుంచి మరోసారి నగదు విడుదలైన వెంటనే కేతగుడిపి, బుడ్డపల్లెకు పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

పింఛన్ల సొమ్ము కోసం వృద్ధుల ఎదురుచూపులు

కేతగుడిపి, బుడ్డపల్లెకు సంబంధించిన పింఛన్ల నగదు మాయం కావడంతో డబ్బులు ఎప్పుడు ఇస్తారో అంటూ వృద్ధులు, దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు. అసలు ఈ నెల పింఛన్లు వస్తాయా..? లేదా..? అంటూ ఆందోళన చెందుతున్నారు.

చెన్నయ్య భూమి హాంఫట్

(3వ పేజీ తరువాయి)

ఉన్నాయి. కానీ అదేగ్రామానికి చెందిన కొందరు రైతులు ఈ భూములపై కన్నేశారు. దేవస్థానం భూముల చుట్టూ పట్టా భూములున్న రైతులే దాదాపు 10 ఎకరాల మేర అక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఆ భూమి విలువ సుమారు రూ.5 కోట్ల వరకు ఉంటుంది. అక్రమంగా తమ భూములకు దేవదాయశాఖకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని రెవెన్యూ అధికారులపై రైతులు కోర్టు కెక్కారు. తద్వారా భూమిని దశాబ్దాలుగా నిరాటంకంగా సాగు చేసుకుంటున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డిని వివరణ కోరగా ఆ గ్రామంలోని 11.37 ఎకరాల భూమి వెంకటాద్రిపాలెం చెన్నకేశవస్వామికి చెందినదేనన్నారు. అందుకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు పాస్ పుస్తకాలు మంజూరు చేశారన్నారు. తప్పకుండా ఆ భూమికి ఆక్రమణల చెర నుంచి విముక్తి కల్పించి స్వాధీనం చేసుకుంటామన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

రిలయన్స్ బయోగ్యాస్ భూమి పూజ ఏర్పాట్లపై కలెక్టర్ అన్సారియా సమీక్ష

పీసీపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీ పరిధిలోని దివాకరపల్లి సమీపంలో బుధవారం జరగనున్న రిలయన్స్ బయోగ్యాస్ భూమిపూజ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సభావేదిక వద్ద జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ప్రతినిధి అనంత్ అంబానీ వస్తున్నట్టు చెప్పారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో కలిసి హెలిప్యాడ్, పార్కింగ్, సభావేదికలోని సీటింగ్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ భూమిపూజ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వచ్చిన కలెక్టర్ అన్సారియా వెంగళాయపల్లి సమీపంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించనున్న పశువుల నీటితొట్టికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్, సర్పంచ్ కరణం తిరుపతయ్య, ఎంపీడీవో ప్రభాకరశర్మ, ఏపీవో మాచర్ల పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

మంత్రి లోకేష్ పర్యటన వివరాలు

- ఉదయం 7:15 నిమిషాలకు తాడేపల్లిలోని ఉండవల్లి గ్రామ నివాసం నుంచి బయలు దేరుతారు
- 7:55 రోడ్డు మార్గం ద్వారా ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు
- 8:30 ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్ బయలు దేరుతుంది.
- 9:15 పీసీపల్లి మండలంలోని దివాకరపల్లిలో హెలిపాడ్ వద్ద దిగుతారు
- 9:20 హెలిప్యాడ్ వద్ద నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరుతారు
- 9:25 దివాకరపల్లిలోని ప్లాంట్ భూమి పూజ వద్దకు చేరుకుంటారు
- 9:30 నుంచి 11:45 వివిధ కార్యక్రమాల అనంతరం బహిరంగ సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారు
- 11:45 బహిరంగ సభ నుంచి రోడ్డు మార్గం ద్వారా హెలిప్యాడ్ వద్దకు చేరుకుని విజయవాడకు బయలుదేరుతారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు తరలిరావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలం దివాకరపల్లిలో జరగనున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ భూమిపూజ కార్యక్రమానికి ప్రజలు అశేషంగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. కనిగిరి ప్రాంతంలో వలసలను నివారించేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. ప్లాంట్ ఏర్పాటుతో కనిగిరి ప్రాంతంలోని యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయన్నారు. దీంతో కనిగిరి ప్రాంత ప్రజల ఆర్థిక పురోగతికి బాటలు ఏర్పడతాయని తెలిపారు.కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వహించాలి

- ఎస్పీ దామోదర్

పీసీపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దివాకరపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరగనున్న బయోగ్యాస్ ప్లాంట్ భూమిపూజ కార్యక్రమంలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. మంగళవారం భూమిపూజ జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. భూమిపూజ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రిలయన్స్ అధినేత కుమారుడు అనంత్ అంబానీ, వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు రానున్నట్లు చెప్పారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభ పూర్తయి అందరూ తిరిగి వెళ్లేంతవరకూ అధికారులు, సిబ్బందికి కేటాయించిన ప్రాంతాల్లో జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. బందోబస్తులో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన స్థలానికి నిర్దేశించిన సమయానికి విధులకు హాజరై ఉండాలన్నారు. బయటి నుంచి వచ్చే వాహనాలు వాటికి కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సభ జరిగే ప్రాంగణానికి వచ్చే రెండు మార్గాలను ఆయన పరిశీలించారు. తొలుత పీసీపల్లి పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ దామోదర్ అక్కడి ఆవరణాన్ని, గదులను, మహిళా సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించి పలు రికార్డులను తనిఖీచేశారు.



బందోబస్తుపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే ముత్తుముల సమీక్ష

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. ఈ నెల 12, 13, 14 తేదీలలో రాచర్ల మండలం నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం టీడీపీ కార్యాలయంలో అధికారులు, పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అటవీశాఖ, ఆర్టీసీ, ఆలయ అధికారులు, వైద్యాధికారులతో పాటు మండలశాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తులకు తాగునీరు, మజ్జిగ అందజేయాలన్నారు. అలాగే ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. అటవీశాఖ నుంచి భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.

స్వామివారి కళ్యాణం, తెప్పోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే చెప్పారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులు సమన్వయంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

దాతలకు ప్రేరణ.. పేదలకు చేయూత

(3వ పేజీ తరువాయి)

మరుగుదొడ్లు, 13 మందికి గృహాలు, 30మందికి పింఛన్లు, ఒకరికి రేషన్‌కార్డు, నాలుగు గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. వారందరికీ ఆ సౌకర్యాలన్నీ కల్పించాలనీ అక్కడే ఉన్న కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆ తర్వాత గ్రామంలో బాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పది కుటుంబాలను అధికారులు గుర్తించగా వారిని వేదికపైకి పిలిచి మాట్లాడారు. అందులో వెంకాయమ్మ అనే మహిళ తనకు భర్త లేడని, పిల్లలిద్దరూ పెద్దవారైనా కూలి పనులకు వెళ్లక తప్పడం లేదని చెబుతూ తాను క్యాన్సర్‌తో పడుతున్న ఇబ్బందిని విడమర్చి చెప్పారు. అలాగే అంకమ్మ అనే మరో మహిళ భర్త విద్యుత్ షాక్‌తో చనిపోగా తన కుమారుడైన వెంకటేష్‌ను చదివించేందుకు పడుతున్న బాధలను వివరించారు. ఇలా ఐదారు కుటుంబాల వారిని పిలిచి వారితో మాట్లాడి పేదల సమస్యలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోండంటూ ప్రజానీకానికి చంద్రబాబు వివరించారు. ఒక మహిళ 'నేను ఈరోజో రేపో రాలిపోతా... కానీ నా అల్లుడు అర్థంతరంగా మరణించాడు. ఆ బాధతో నా కుమార్తె పక్షవాతానికి గురైంది. వారి ద్దరి పిల్లలు చేయూత లేక తల్లడిల్లుతున్నారు. ఈ వయస్సులో కుటుంబాన్ని ఈదలేకపోతున్నానంటూ' చెప్పిన మాటలతో సీఎం చలించిపోయారు. ఇదే కుటుంబ అనుబంధం అంటూ ఆయన వారికి చెబుతూ.. మాట్లాడిన మహిళలు తమకోసం కాక పిల్లల కోసం చేస్తున్న అభ్యర్థనలు విని చేయూతనిచ్చే మార్గదర్శకులు(దాతలు) ముందుకు రావాలని కోరారు. అదేవేదిక మీద ముందుగా గుర్తించిన విక్రమ్ నారాయణ(గొనసపూడి), ఇంకొల్లు మండలం గొల్లపాలెంకు చెందిన అంజనేయులు అనే పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి పీ-4 కార్యక్రమంలో మార్గదర్శి-బంగారు కుటుంబం అనేది మా నినాదం అంటూ వారికి వివరించారు. పారిశ్రామికంగా వారు ఎదిగిన విధానాన్ని స్వగ్రామాల్లో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకుని, ఈ పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని బహిరంగంగా కోరారు. అప్పటికే పేదల మాటలతో చలించిపోయిన ఆ వ్యాపారవేత్తలిద్దరూ సీఎం ఇచ్చిన స్ఫూర్తితో ఆ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు హామీ ఇచ్చారు. తలా 15 కుటుంబాలను ఆర్థికంగా ఉన్నత స్థాయిలోకి తెచ్చే విధంగాచేయాలని సూచిస్తూ తదనుగుణంగా ఆ పారిశ్రామికవేత్తలకు సేవా పుస్తకాలతో సన్మానిస్తానని ప్రకటించారు. ఒక మహిళ కుమారుడైన గణేష్‌ను చదివించే బాధ్యత విక్రమ్‌నారాయణకు అప్పగిస్తూ, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ చికిత్సకు ప్రభుత్వ పరంగా పూర్తి ఆర్థిక సహాయం ఇవ్వాలని కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇప్పటికే ఆ గ్రామంలోని పలువురు పేదలకు తన ట్రస్టు ద్వారా ఇస్తున్న చేయూతను, వైద్య చికిత్సను ప్రస్తావిస్తూ కొనియాడారు.

అగ్రస్థానంలో పర్చూరు

పాలనే కాక రాజకీయ వ్యవహారాలు, పార్టీపరమైన వ్యవహారాల్లో కూడా పర్చూరు నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు కొనియాడారు. హెలిప్యాడ్‌కు సమీపంలో ఏర్పాటుచేసిన వేదిక వద్ద నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన భేటీ అయ్యారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సత్యప్రసాద్, ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్ కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 15మంది పార్టీ నాయకులను పేరుపేరున ప్రస్తావిస్తూ సీఎం అభినందించారు. ఈ నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు టీడీపీ తరఫున ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గెలిచి చరిత్ర తిరగరాశాడని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఒక కార్యక్రమంలో కలిసిన ఏలూరి తన అభిమాని అని, అందుకే పనితీరులో తనను అనుసరిస్తూ అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. పార్టీ నిర్మాణ వ్యవహారాల్లో రాష్ట్రంలో తొలి మూడు స్థానాల్లో పర్చూరు నియోజకవర్గం ఉందన్నారు. వ్యక్తిగతంగా ఏలూరికి 100కు 88 పైబడి మార్కులు తెచ్చుకున్నారని సీఎం చెప్పారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో తోడ్పడతానని బాబు హామీ ఇచ్చారు.

పోర్టు కోసం కేంద్రంతో మాట్లాడతా

అదే కార్యక్రమంలో చివర్లో ఎమ్మెల్యే ఏలూరి అందించిన సమస్యల చిట్టాలోని ప్రధాన అంశాలను ప్రస్తావించారు. మోటుపల్లి వద్ద పోర్టు నిర్మాణానికి సాంకేతికఅనుమతులు లభిస్తే కేంద్రంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. అలాగే అనుబంధ పరిశ్రమలను తీసుకొస్తానని ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే ఇచ్చిన సమస్యల చిట్టాను చదువుతూ నాలుగు కొత్త ఎత్తిపోతలకు, 32 పాత ఎత్తిపోతల పథకాల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. సాగర్ కాలువ ఆధునికీకరణతోపాటు కేడబ్ల్యూడీ ఆయకట్టు పరిధిలో ఆయకట్టు అభివృద్ధి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.5 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. రోడ్లు, వంతెనలు ఇతరత్రా అనేక సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుంటూరు చానల్ పొడిగింపు విషయంలో ఇప్పటికే సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

అవీఇవీ

భవిష్యత్‌కు భరోసా

(3వ పేజీ తరువాయి)

ఏడాదికి రూ.31వేలు, అసైన్డ్‌భూములకు రూ.15వేలు కౌలు ఇవ్వనున్నారు. అలాగే గిద్దలూరు, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో మరికొన్ని ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దివాకరపల్లి పర్యటన సందర్భంగా ప్రకటించడం పశ్చిమప్రాంత ప్రజల్లో మరింత సంతోషాన్ని కలిగిస్తోంది. కాగా దర్శి నియోజకవర్గంలోని దొనకొండ మండలం రుద్రసముద్రం, కనిగిరి నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలాల్లో రాష్ట్రప్రభుత్వం అల్ట్రా మెగా సోలార్ ప్లాంట్లను ప్రకటించింది. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐసీఐ) 2024 పాలసీలో భాగంగా దేశంలోనే పునరుత్పాదక విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని అగ్రభాగాన ఉంచే లక్ష్యంతో 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది.

రూ.10వేల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో సుమారు రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు, 7.50 లక్షల ఉద్యోగాల కల్పన రానున్న ఐదేళ్లలో రానున్నాయి. అందులో తాజాగా జిల్లాకు ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు అల్ట్రా మెగా సోలార్ ప్లాంట్లు మంజూరు చేసినట్లు తాజాగా జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం ప్రకటించింది. అలా ఒకవైపు రిలయన్స్ ప్లాంట్లు, మరోవైపు అల్ట్రామెగా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో పశ్చిమప్రాంతంలో పారిశ్రామిక వెలుగులు రానున్నాయి. వీటి ద్వారా ఆ ప్రాంత ప్రజలకు ప్రత్యేకించి యువతకు ఉపాధి లభించనుంది. ఇదే సమయంలో ఇప్పటికే పశ్చిమ ప్రాంతంలో చేపట్టిన పలు కీలక ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టిసారించి పూర్తిచేయడం ద్వారా భవిష్యత్ జీవనానికి భరోసా కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కీలక ప్రాజెక్టులపై ఆశలు

గతంలో టీడీపీ ప్రభుత్వంలో దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు జరిగింది. దొనకొండ మండలంలో సుమారు 25వేల ఎకరాలకు పైగా భూములను సర్వే చేసి పరిశ్రమల ఏర్పాటుకు గుర్తించారు. అంతకు ముందే కేంద్రం కనిగిరి ప్రాంతానికి జాతీయ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన జోన్(నిమ్జ్)ను మంజూరు చేయగా నాటి టీడీపీ ప్రభుత్వం ప్రాథమిక చర్యలు తీసుకుంది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ రెండింటినీ గాలికొదిలేసింది. ట్రిపుల్ ఐటీ నిర్మాణాన్ని పట్టించుకోలేదు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ, సర్వజన ఆస్పత్రి నిర్మాణాలు అత్యంత ఆవశ్యంగా ప్రజానీకం కోరుతున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి నీరు ఇవ్వాలన్న కోరిక ఆ ప్రాంత ప్రజల్లో బలంగా ఉంది. ప్రభుత్వంలోనూ, తెలుగుదేశం పార్టీలోనూ అత్యంత కీలకంగా ఉన్న మంత్రి నారా లోకేష్ పశ్చిమప్రాంతంపై దృష్టిపెట్టి రిలయన్స్ ప్లాంట్ ఇక్కడ ఏర్పాటుకు కృషిచేశారన్న సమాచారంతో వెలిగొండ ప్రాజెక్టు పూర్తిపై కూడా దృష్టిపెట్టాలని పశ్చిమప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వెలిగొండనే అన్నింటికీ ఆధారం

పశ్చిమప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలు తీర్చడానికి వెలిగొండ తప్ప మరొక మార్గం లేదు. అలాగే పారిశ్రామిక అవసరాలకు కూడా వెలిగొండ పూర్తిచేస్తేనే తప్ప నీటి లభ్యత ఉండదన్న విషయాన్ని పాలక పెద్దలు గుర్తించాలని ప్రజానీకం కోరుతోంది. పశ్చిమప్రాంతంలో నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలు సాగుతూ రవాణా సౌకర్యాలు భారీగా మెరుగుపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పారిశ్రామిక వెలుగులు, వెలిగొండ పూర్తి, ట్రిపుల్ ఐటీ, మెడికల్ కాలేజీల నిర్మాణం వంటి కీలక పనులు పూర్తితోపాటు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తే దశాబ్దాల కాలంగా కొనసాగుతు ఉన్న సమస్యలు తీరతాయి. వలసలు నివారణ జరిగి ఉపాధికి, భవిష్యత్ జీవనానికి భరోసా లభిస్తుంది. ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాలని ఆ ప్రాంత ప్రజానీకం కోరుతున్నారు.

అభివృద్ధికి పన్నులే ఆధారం

(3వ పేజీ తరువాయి)

అనుగుణంగా కమిషనర్లు ప్రజల్లో అవగాహన పెంచారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి లక్ష్యాలను సాధించడంలో సఫలీకృతులయ్యారు. చీమకుర్తి 85.9శాతం వసూలు చేసి జిల్లాలో ప్రథమస్థానంలో ఉండగా, 46.21 శాతం మాత్రమే సాధించి పొదిలి ఆఖరి స్థానంలో నిలిచింది. ఒంగోలు కార్పొరేషన్‌లో అత్యధిక డిమాండ్ ఉండటంతో 66.73 శాతం వసూలు చేసింది. గడిచిన ఏడాదితో పోల్చుకుంటే రూ.10కోట్లు అదనంగా వసూలు చేసి ఫర్వాలేదనిపించుకుంది. మొత్తంగా వడ్డీపై యాభై శాతం రాయితీ కలిసి రావడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో జనరల్ ఫండ్‌కు ఢోకా లేదనే చెప్పొచ్చు. జిల్లాలో 1,28,213 అసెస్‌మెంట్‌లకు సంబంధించి మార్చి 31 నాటికి రూ.77.41 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉంది. అందులో రూ.52.74 కోట్లు (68.14శాతం) వసూలు చేసి లక్ష్యాలను చేరుకున్నారు.

మొదటి స్థానంలో చీమకుర్తి.. ఆఖరిలో పొదిలి

చీమకుర్తి మునిసిపాలిటీలో 6,659 అసెస్‌మెంట్‌లు ఉండగా, రూ.3.34 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అందులో రూ.2.84 కోట్లు (85.09 శాతం) రాబట్టి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచింది. గిద్దలూరులో 11,544 అసెస్‌మెంట్‌లకు సంబంధించి రూ.4.03 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అందులో రూ.3.17 కోట్లు (78.66) శాతం వసూలు చేసి ద్వితీయ స్థానంలో నిలిచింది. మార్కాపురంలో రూ.8.56 కోట్ల వసూలుకు గాను రూ.6.10 కోట్లు (71.26 శాతం) రాబట్టి మూడో స్థానంలో ఉంది. కనిగిరిలో 9,411 అసెస్‌మెంట్‌లకు రూ.4.20 కోట్లు వసూలు లక్ష్యం. అందులో రూ. 2.96 కోట్లు (70.61శాతం) వసూలు చేసి నాల్గోస్థానంలో నిలిచింది. దర్శిలో 9,437 అసెస్‌మెంట్లకుగాను రూ.5.05 కోట్లు రావాల్సి ఉంది. రూ.3.37 (66.72)శాతం వసూలు చేసి ఐదోస్థానంలో ఉంది. పొదిలిలో 10,806 అసెస్‌మెంట్‌లకు రూ.3.16 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అందులో రూ.1.55 కోట్లు (49.21 శాతం)మాత్రమే వసూలు చేసి ఆఖరి స్థానంలో నిలిచింది.

అప్పుల నుంచి ఆదాయంలోకి కార్పొరేషన్

వైసీపీ పాలనలో పన్నుల వసూళ్లను పట్టించుకోకపోవడంతో అప్పులతో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడిన ఒంగోలు కార్పొరేషన్ తాజాగా ఆ పరిస్థితి నుంచి బయటపడింది. ఫిబ్రవరి మొదటి వారానికి కార్పొరేషన్ ఖజానాలో కేవలం రూ.3.37 కోట్లు మాత్రమే ఉన్నాయి. అవి కార్యాలయ నిర్వహణ, కాంట్రాక్టు ఉద్యోగులు జీతాలు, కరెంటు బిల్లులు, ఇతరత్రా అత్యవసర అవసరాలకే సరిపడే పరిస్థితి. దీంతో ఆదాయ వనరులపై దృష్టి సారించిన కార్పొరేషన్ ప్రభుత్వ ఖాళీస్థలాల లీజు, మొండిబకాయిదారులకు నోటీసులతో ఆదాయ వృద్ధివైపు అడుగులు వేసింది. మార్చి 15వ తేదీ వరకు పన్నుల వసూలు అంతంతమాత్రంగానే ఉంది. ప్రభుత్వం వడ్డీపై యాభై శాతం రాయితీ ఇవ్వడంతో అందుకు అనుగుణంగా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒకవైపు ప్రజల్లో అవగాహన కల్పిస్తూనే మరోవైపు సెలవు రోజుల్లోనూ పన్నులు వసూలు చేశారు. నగరంలో మొత్తం 63,302 అసెస్‌మెంట్‌లు ఉండగా, రూ.49.08 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీంతో కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలతో కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రణాళిక రూపొందించారు. ప్రతిరోజూ వసూలు నివేదికలు, టెలీకాన్ఫరెన్స్‌లు, అవసరమైతే నేరుగా వసూళ్లకు రంగంలోకి దిగారు. గతేడాది మార్చి 31 నాటికంటే ఈ ఏడాది రూ.10కోట్లు అదనంగా వసూలు చేసి ప్రత్యేకతను చాటుకున్నారు.





సీఎం చంద్రబాబుతో జాలమ్మ కుటుంబ సభ్యులు

సీఎం పర్యటనతో గ్రామానికి మహర్దశ

సీఎం చంద్రబాబు మంగళవారం కొత్తగొల్లపాలెంలో పర్యటిస్తుండటంతో గ్రామానికి మహర్దశ పట్టింది. నియోజకవర్గంలో మారుమూల గ్రామం కావడంతో సమస్యలు అధికం. కొంతమేరకు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి గ్రామం పట్ల చురుగ్గా వ్యవహరిస్తూ సమస్యలను ప్రాధాన్యతక్రమంలో పరిష్కరిస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే సీఎం పర్యటన ఉండటంతో గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పడ్డాయి. అలాగే కొత్తగా విద్యుత్ స్తంభాలతోపాటు దీపాలు బిగించారు. పైగాగ్రామంలో పలుచోట్ల పర్యటించిన సీఎం అక్కడి అవసరాలను గుర్తించారు. సీఎం గ్రామంలోకి రావడంతో చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ బాబును చూసేందుకు పోటీపడ్డారు. అలాగే కరచాలనం చేస్తూ జైజై చంద్రన్న, జై జైసాంబన్న అంటూ నినాదాలు చేశారు.



టీడీపీ చీరాల సీనియర్ కార్యకర్త మనోహర్

మారుమూల గ్రామంలో పండుగ వాతావరణం

చినగంజాం మండలం కొత్త గొల్లపాలెంలో పింఛన్ పంపిణీ చేసిన సీఎం

చంద్రబాబు రాకతో గ్రామానికి మహర్దశ

ముఖ్యమంత్రిని చూసేందుకు పోటీపడిన స్థానికులు

గ్రామాన్ని అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్న సీఎం

పర్చూరు/చీరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : "నలభై ఏళ్లుగా ఈ గ్రామం టీడీపీ కంచుకోటగా ఉంది.. కష్టాలెన్ని ఎదురైనా, సమస్యలెన్ని ఉన్నా ఎమ్మెల్యే ఏలూరికి అండగా, పార్టీకు తోడుగా నిలుస్తున్నారు.. ఈ గ్రామానికి రుణపడి ఉన్నా.. అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా"నని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెంలో మంగళవారం కోలాహలంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎం కొండయ్య, జిల్లా కలెక్టర్ వెంకటమురళీ, జేసీ ప్రకర్‌జైన్ హెలీప్యాడ్ వద్దకు చేరుకుని ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎం పింఛన్‌దారులు బత్తుల జాలమ్మ, వడ్లమూడి సుభాషిణి నివాసాలకు చేరుకుని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం వారికి పింఛన్ అందజేశారు. ఈక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి ఆయా కుటుంబాల్లో నెలకొన్న సమస్యలను సీఎంకు వివరించారు. ఆ కుటుంబాలకు అండగా ఉంటామని సీఎం చెప్పడంతోపాటు ఒక్కో ఇంట్లో సుమారు 10నిమిషాల వరకు గడిపి వారితో మాటామంతీ కలిపారు. దీంతో వారందరూ ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. అనంతరం సమీపంలోని రామాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని సీఎం కొబ్బరికాయ కొట్టగా, అది సమాంతరంగా పగలడంతో ధర్మకర్త యల్లావుల వెంకటేశ్వర్లు కొబ్బరికాయ చక్కగా పగిలింది.. మీకు అంతా శుభమే జరుగుతుందని చెప్పడంతో అందరిలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.



జై జై చంద్రన్న అంటూ కరచాలనం చేస్తున్న స్థానికులు

బీఎన్‌ను పరామర్శించిన సీఎం

వయసు పెరిగిన విషయం మర్చిపోయావా అంటూ చమత్కారం

ఒంగోలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : "వయస్సు పెరిగిన విషయం మర్చిపోయావా, ఆటలు ఆడుతూ గాయపడ్డావు కదా ఎలా ఉంది" అంటూ సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలుకరించారు. అంతసెట్ అయిందా అని పరామర్శించారు. బాపట్ల జిల్లా పెద్దగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో మంగళవారం సీఎం చంద్రబాబు కార్యక్రమం జరగ్గా అక్కడి హెలిప్యాడ్ వద్ద పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనను కలిశారు. అందరిని పలుకరిస్తున్న చంద్రబాబు బీఎన్ వద్దకు వచ్చినపుడు "ఏమి విజయ్ ఏలా ఉన్నావని" పలుకరించారు. ఆ సమయంలో ఇటీవల విజయవాడలో జరిగిన ఎమ్మెల్యేల క్రీడోత్సవాల సందర్భంగా క్రికెట్ ఆడుతూ బీఎన్ గాయపడ్డ విషయాన్ని పక్కన ఉన్న మంత్రి గొట్టిపాటి సీఎం గుర్తించారు. దీంతో వయస్సు పెరిగిన విషయం మార్చిపోయావా అంటూ సీఎం చమత్కరించగా.. క్రికెట్ బాగానే ఆడతానని బీఎన్ సమాధానం ఇచ్చారు. ఇప్పుడు అంతా సెట్ అయినట్లేనా అని బీఎన్ భుజం తట్టి సీఎం కూడా వెళ్లారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం

● విద్యార్థులు రాక ప్రభుత్వ జూనియర్ కాలేజీలు వెలవెల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా సంస్కరణలో భాగంగా మంగళవారం నుంచి జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో కళకళలాడుతుండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మాత్రం పిల్లలు లేక వెలవెలబోతున్నాయి. గతేడాది వరకు జూన్ 1నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించేవారు. అయితే ఇంటర్ విద్యలో సమూల మార్పుల్లో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఏప్రిల్ నుంచి సీనియర్ ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఇంటర్ విద్యా మండలి ప్రకటించింది. ఈనేపథ్యంలో మంగళవారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభించాల్సి ఉండగా ప్రైవేటు కళాశాలలకు విద్యార్థులు హాజరు కాగా ప్రభుత్వ కళాశాలలకు మాత్రం ముఖం చాటేశారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు లేక వెలవెలపోయాయి. ఇక కేజీబీవీల్లో విద్యార్థినులు ఒక మోస్తరుగా హాజరు కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లు, ఏపీ మోడల్ స్కూళ్లలో విద్యార్థులు నామమాత్రంగా హాజరయ్యారు. ప్రస్తుతం ఇంటర్ మూల్యాంకనం కొనసాగుతున్నందున కళాశాలల్లో పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులు లేరు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తరగతులు ప్రారంభించినా అసలు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలు జిల్లా అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఒక్క విద్యార్థి కూడా మాల్ ప్రాక్టీస్ కింద బుక్‌కాలేదు. పరీక్షలు ప్రారంభమైన తర్వాత మరింత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు స్కాడ్ అధికారుల సంఖ్యను పెంచారు. 9 ఫ్లయింగ్‌స్కాడ్లను పదికి, 25 సిట్టింగ్ స్కాడ్స్‌ను 33కు పెంచారు. పరీక్షా కేంద్రంలో నిద్రపోతున్న ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను, సింగరాయకొండలో హిందీ నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఇరువురు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఏవీ సుబ్బారెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్‌లు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

506మంది గైర్హాజరు

పదో తరగతి పరీక్షల్లో చివరగా మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు 506 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు 29,486 మందికి 28,980 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 24 మందికి 8 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ముగియడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద సందడి చేశారు. చేతుల్లోని కాగితాలను చింపిముక్కలు చేసి గాల్లోకి విసురుతూ కేరింతలు కొట్టారు. ఒంగోలులో హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి తమ సామగ్రిని సర్దుకొని సొంతూర్లకు వెళ్లిపోయారు.

పాతపాడులో వ్యక్తి హత్య..?

● 15 రోజులుగా కనిపించని అర్జున్‌రెడ్డి

● అదే రోజు నుంచి మృతుడి భార్య, మరొకరు గ్రామం నుంచి పరారీ

● మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ మండలం పాతపాడు గ్రామానికి చెందిన మూరబోయిన అర్జున్‌రెడ్డి(55) అదృశ్యం గ్రామంలో కలకలం రేపుతోంది. పదిహేను రోజులుగా ఆయన కనిపించడం లేదు. ఈ మేరకు గత నెల 29న ఆయన సోదరుడు వెంకటేశ్వరరెడ్డి ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తన సోదరుడు అర్జున్‌రెడ్డి గత నెల 19వ తేదీ నుంచే కనింపించడం లేదని అందులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాతపాడులో మాత్రం అర్జున్‌రెడ్డి హత్యకు గురై ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. అదేక్రమంలో ఆయన భార్య పరారీలో ఉండటంతో అర్జున్‌రెడ్డిని హత్య చేశారా అనే అనుమానాలకు ఊతం ఇస్తోంది. అంతేగాకుండా కనీసం తన భర్త కనిపించడం లేదని ఆమె తన కుటుంబసభ్యులతో కానీ, కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయకుండా గ్రామం వదిలి వెళ్లడం అనుమానాలకు మరింత బలం చేకూరుతోంది. వివాహేతర సంబంధం వల్ల హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డితో అర్జున్‌రెడ్డి భార్యకు వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా అర్జున్‌రెడ్డి కనిపించని రోజు నుంచి రమేష్‌రెడ్డి కూడా ఊరు వదిలి వెళ్లాడని నిర్ధారణకు వచ్చారు. రమేష్‌రెడ్డి 2012లో తన భార్యను హత్య చేసి రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లి వచ్చిన చరిత్ర ఉంది. ఈక్రమంలో అర్జున్‌రెడ్డిని కూడా హత్య చేశారా.. ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు మాత్రం రమేష్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి భార్యను అదుపులోకి తీసుకొని గోప్యంగా విచారిస్తునట్లు తెలిసింది. ఒంగోలు పరిసర ప్రాంతాల్లోనే అర్జున్‌రెడ్డిని హత్య చేసి పూడ్చి వేశారనే వదంతులు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పామూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి బుధవారం ఒంగోలులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరుగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పామూరు జోన్ నాయకులు షేక్ నాయబ్‌రసూల్, వై.రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం పామూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 176 నెలల డీఏ బకాయిలు, సరెండర్ లీవు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అవ్వా తాతల్లో ఆనందం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ప్రతి గ్రామంలో పింఛన్ల పంపిణీ

వీసీపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వం ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పింఛన్ అందుకునేటప్పుడు అవ్వా తాతల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయపల్లిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీచేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేల పింఛన్‌ను రూ.వెయ్యి పెంచి రూ.నాలుగు వేలు ఇస్తుందన్నారు. ఇంకా అర్హులైన లబ్దిదారులుంటే వారికి కూడా ప్రభుత్వం కొత్తగా పెన్షన్‌లను మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం తిరుపతయ్య, ఎంపీడీవో ప్రభాకారశర్మ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరిరామయ్య, చంద్రయ్య, తిరుపతిరావు, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ ధ్యేయం

ముండ్లమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని నాయుడుపాలెం, పెదరావిపాడు గ్రామాల్లో పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయంతో సీఎం చంద్రబాబు ఎంతో కష్ట పడుతున్నారన్నారు. ఒకవైపు సంక్షేమ ఫలాలు అందిస్తూనే మరోవైపు అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ - 6 పథకాల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇప్పటికే 80 శాతం నెరవేర్చారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రమంతా గోతులమయంతో ప్రజలు ప్రయాణించ లేక ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు కేటాయించి రహదారులకు మరమ్మతులు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. దర్శిని రాష్ట్రంలోనే నెంబరు - 1 నియోజక వర్గంగా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. ఉపాధి హామి పథకం నిధులతో ప్రతి గ్రామంలో పశువుల దాహార్తి తీర్చేం దుకు నీటితొట్టిలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. అనంతరం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను మాజీ సర్పంచ్ బద్రి గోపాలరెడ్డి సన్మానించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఏపీడీ లలితకుమారి, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, దారం సుబ్బారావు, సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు, మాజీ జడ్పీటీసీలు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, శంకరాపురం, వేముల సర్పంచ్‌లు నారాయణ స్వామి, గజ్జల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపాలెంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి

పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

కనిగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ రూల్స్ సవరణ ఆమోదం దుర్మార్గమని ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ప్రధానకార్యదర్శి నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో భవనంలో జరిగిన పెన్షనర్ల సంఘ సమావేశం లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉభయసభల్లో ఆమోదింపచేసిన పెన్షన్ సవరణ బిల్లు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు ప్రమాదంగా మారిందన్నారు. ఈ సవరణ చట్టం బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందితే 50లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 65లక్షల మంది పెన్షనర్‌లకే గాక దేశ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు ఉరితాడుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పెన్షన్ సవరణ బిల్లును నేరుగా పార్లమెంట్‌లో ప్రవేశపెడితే అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయంతో ఆర్థిక బిల్లులో చేర్చి ఆమోదింప చేసుకోవటం అన్యాయమన్నారు. ఇక నుంచి రెండు రకాల పెన్షన్‌లు అమలులోకి తెచ్చేందుకే కేంద్రం చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. పెరిగిన ధరలు, మారుతున్న కాలంతో సంబంధ లేకుండా ఇచ్చే పెన్షన్ వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నట్టు చెప్పారు. పెన్షన్ సవరణ బిల్లు ఉపసంహరించుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌ల సంఘాలు పెద్ద ఎత్తున తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తారని హెచ్చరించారు. సమావేశంలో పెన్షనర్‌ల సంఘం నాయకులు ముక్కు వెంకట రెడ్డి, నాగభూషణం, మీగడ వెంకటేశ్వర రెడ్డి, వీ మాలకొండారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చెన్నయ్య, గౌస్ మొహిద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, యర్రారెడ్డి, జీ కృష్ణమూర్తి, కరిముల్లా పాల్గొన్నారు.

రెండు దేవాలయాల్లో చోరీ

దర్శి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంకోజనపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో, తూర్పువెంకటాపురం శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దుండగులు ఆలయాల్లో హుండీలను పగులగొట్టి సుమారు రూ.20 వేల కానుకలను అపహరించారు. ఈ ఆలయాలు ఊరికి బయట ఉండటంతో రాత్రి పూట జరిగిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. దర్శి ఎస్సై మురళి ఆలయాల్లో జరిగిన ఘటనలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో దర్శి ప్రాంతంలో పలు దేవాలయాల్లో చోరీలు జరుగుతుండడంగమనార్హం.

ఏకలవ్యకాలనీలో నాటుబాంబు కలకలం

రెండు వర్గాల మధ్య ఘర్షణ

పందులను చంపేందుకు వినియోగించే నాటు బాంబు ప్రయోగం

కుక్క కొరకడంతో పేలి మృతి

మార్కాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఓ వ్యక్తి నాటుబాంబు విసిరిన సంఘటన సోమవారం రాత్రి స్థానిక ఏకలవ్యకాలనీలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకున్నా, ఆ నాటుబాంబును కొరికిన కుక్క మృతి చెందింది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు, ఎస్టేట్‌కు సమీపంలోని ఏకలవ్య కాలనీలో ఒకే సామాజికవర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య సోమవారం నుంచి ఘర్షణ వాతావరణం అలుముకున్న పరిస్థితుల్లో... అదే కాలనీకి చెందిన బల్లాని శంకర్ ఒక సెల్‌ఫోన్‌ను అదేప్రాంతానికి చెందిన ఓ మహిళకు విక్రయించాలని చూశాడు. దొంగ సొత్తు అని అనుమానించి తనకు వద్దని నిరాకరించింది. దీంతో ఆమెను శంకర్ దుర్భాషలాడాడు. ఈ విషయం తెలిసిన ఆమె సోదరుడు దేవరకొండ సురేష్ వెంటనే శంకర్ వద్దకు వెళ్లి ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో సురేష్‌తోపాటు మరికొందరు కలిసి శంకర్‌పై దాడిచేశారు. దీంతో కోపోద్రిక్తుడైన శంకర్ పందులను చంపేందుకు ఉపయోగించే నాటుబాంబును సురేష్, అతని అనుచరులపై విసిరాడు. అది పేలకుండా పక్కన పడింది. పందులను ఆకర్షించేందుకు ఆ బాంబుకు జీవాల కొవ్వులను పూస్తారు. ఆ వాసనకు అటుగా వెళ్లిన ఓ కుక్క నాటుబాంబును నోటకరిచి గట్టిగా కొరికింది. దీంతో అది పేలి కుక్క తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. సురేష్ దాడిలో గాయాలపాలైన శంకర్‌ను మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ఇరువైపులా ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. నాటుబాంబుల విషయమై ఎస్సై సైదుబాబును వివరణ కోరగా ఏకలవ్య కాలనీలోని ఓ సామాజికవర్గం వాళ్లు పందులను చంపేందుకు ఈ రకమైన బాంబులు తయారు చేసుకుంటారని తెలిసిందన్నారు. వాటిని పొలాల్లోకి వచ్చే అడవి పందులు గట్టిగా కొరికితేనే పేలుతాయన్నారు. నాటుబాంబులు తయారు చేయడం నేరం కాబట్టి ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
- పైడిపాడులో పింఛన్ల పంపిణీ
- ఉప్పుగుండూరులో ఎమ్మెల్యే బీఎన్ అందజేత

జరుగుమల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. అందుకోసం సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. మండలంలోని పైడిపాడు గ్రామంలో మంత్రి స్వామి మంగళవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును అందజేశారు. అనంతరం గ్రామంలోని సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి ఉదయాన్నే అధికారులు పింఛన్‌లను అందజేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని 9లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని మంత్రి విమర్శించారు. ఆ ఊబి నుంచి బయటకు తెచ్చి అభివృద్ధి వైపు నడిపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, పూలే, చంద్రబాబునాయుడు వంటి గొప్పవారంతా ఏప్రిల్‌లోనే పుట్టారని స్వామి చెప్పారు. చంద్రబాబు ప్రవేశపెడుతున్న పీ-4లో భాగస్వాములై ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, గ్రామ తెలుగు యువత నాయకుడు బత్తిన పూర్ణ, ఎంపీడీవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పైడిపాడు జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి


ఉప్పుగుండూరులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు మండలంలో

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలోని యరజర్ల, మండవవారిపాలెం, ఉలిచి గ్రామాల్లో ఎంపీడీవో రాజశేఖరరావు చేతుల మీదు మంగళవారం పింఛన్లు అందజేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను నగదును ఆయన పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో పింఛన్లు ఉదయాన్నే అందజేశారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మంగళవారం పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. మండలంలోని చేకూరపాడు, ఉప్పుగుండూరు గ్రామాల్లో పింఛను నగదును స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఇంటూరి శ్రీనివాసరావు, కరణం మోహనరావు, మెట్టు సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్, కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీను, పెంట్యాల కోటేశ్వరరావు, పెంట్యాల శ్రీను, తెలగతోటి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు:మండలంలో మంగళవారం సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. బసవన్నపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, వెల్లంపల్లి బీసీ కాలనీలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్‌లు ఇంటింటికి వెళ్లి పెన్షన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, గ్రామ సర్పంచ్ మండవ శివానందరావు, మారెళ్ల హరికుమార్, దేవభక్తుని ప్రసాద్, పాటిబండ్ల అజయ్‌బాబు, చుండూరి రఘురాం, మండవ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దకొత్తపల్లిలో పోతినేని శ్రీనివాసరావు, మద్దిపాడులో కడియాల రఘుబాబు, ఘడియపూడిలో చింతల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ జరిగింది.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలో మంగళవారం సాయంత్రానికి 94శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 6,683 మందికి గాను 6,272 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లను అందించినట్లు ఆయన చెప్పారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం

- పట్టించుకోని అధికారులు

మద్దిపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వారానికి ఒక సారి కూడా చెత్తను తొలగించడం లేదు. డ్రైనేజీలో పూడిక తీత తీయకపోవడంతో దోమలు వృద్ధి చెందిన రోగాలను వ్యాప్తి చేస్తున్నారు. అరుంధతినగర్‌లో మురుగు పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. కడియాల యానాదయ్య ప్రభుత్వ కళాశాల గోడ సమీపంలో చెత్తాచెదారం పేరుకొని పోయింది. బీసీకాలనీలో డ్రైనేజీలో మురుగు ముందుకు కదలడం లేదు. దళితవాడలో మురుగు పేరుకుపోయి దోమలు విజృంభిస్తునానయి. పంచాయతీ పాలకులు, అధికారులు కనీసం దోమలకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. అలాగే ఘడియపూడి కాలనీలోకి కనీసం చెత్తబండి కూడా రావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం అయితే బయట ఉండలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘాల ద్వారా రుణాలు

మద్దిపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతలకు వాణిజ్య రుణాలు అందించటానికి చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మద్దిపాడులోని నందిపాడు సొసైటీ రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పంట రుణాలతో పాటు వాణిజ్య రుణాలు ఇస్తామని చెప్పారు. సీఈవో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సొసైటీలు పాత సభ్యత్వాలు కలిగిన వారు రూ.330 రుసుము కట్టి రూ.10వేలు డిపాజిట్ చేస్తే ఓటుహక్కు వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల తొట్టి నిర్మాణానికి శంకుస్థాపన


తొట్టి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హరిబాబు

సంతనూతలపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంగమూరు గ్రామంలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధిహామీ పథకం పశువుల తొట్టి నిర్మాణానికి మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. స్థానిక చెరువు సమీపంలో తొట్టినిర్మాణాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఏపీవో వాసంతి, నీటిసంఘం అధ్యక్షుడు నల్లూరి క్రిష్టారావు, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు రోడ్డులో గుంతలతో అవస్థలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


నడిరోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులో గల గుంతలతో వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు. ప్రతిరోజు పలువురు ప్రమాదాల బారిని పడుతున్నారు. ఈ రోడ్డులో రైల్వే ఫ్లైఓవర్ వంతెనకు తూర్పు వైపున నాలుగు వరుసల రోడ్డులో, సాయి ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ ఎదురు.. ఇంకా పలు చోట్ల రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. అయితే వాటిని గుర్తించ లేని ద్విచక్ర వాహనదారులు వేగంగా ప్రయాణిస్తూ గుంతల్లో పడి ఆసుపత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

అభివృద్ధి పనులపై జీఎస్టీ పిడుగు

గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాల సేకరణ ● త్వరలో నోటీసులు పంపనున్న కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలంలో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేసినవారిపై జీఎస్టీ పిడుగు పడనుంది. గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాలను తమకు అందజేయాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ఎంపీడీవోకు అధికారికంగా లెటర్ ఇవ్వటంతో పాటు ఒక అధికారి ప్రత్యేకంగా మండల కార్యాలయానికి విచ్చేసి వివరాలను త్వరగా అందజేయాలని కోరటం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న వర్క్‌లు చేసిన వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. గత మూడేళ్లలో కూటమి ప్రభుత్వం రాకముందు వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.22కోట్ల వివిధ రకాల పనులను గ్రామాలలో నిర్వహించారు. మండలపరిషత్ పగ్గాలు వైసీపీ చేతిలో ఉండటంతో పనులన్నీ ఆ పార్టీ నాయకులే నిర్వహించారు. అయితే పనులు నిర్వహించిన వారిలో జీఎస్టీ నంబర్ కల్గిన వారికి పెద్దగా ఇబ్బంది లేదు. వారు ఎప్పటికపుడు జీఎస్టీ వివరాలను వాణిజ్య పన్నులశాఖకు అప్డేట్ చేస్తుంటారు. కానీ ఎక్కువ మంది జీఎస్టీ ఖాతాలు లేనివారే నామినేషన్ పద్ధతిలో గ్రామాల్లో పనులు నిర్వహించారు. ఇపుడు వారందరూ నోటీసులు అందుకోనున్నారు. 18శాతం చొప్పున దీనికి అదనంగా వడ్డీతో సహ జీఎస్టీ రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.5లక్షలు వర్క్ చేస్తే దాదాపు రూ.90వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఎపుడో చేసిన పనులకు ఇపుడు అదనంగా డబ్బులు చెల్లించాల్సి రావటం పట్ల పనులు చేసినవారికి పాలుపోవటం లేదు. నోటీసులు అందితే దానిని బట్టి ఏమి చేయాలో డిసైడ్ అవుదాములే అని వైసీపీ అధిష్ఠానం తమ నాయకులను ఊరడిస్తుంది. కాగా దీని ఎఫెక్ట్ కొత్తగా నిర్వహించబోయే పనులపై కూడా పడుతుంది. మండల నిధులతో పనులు నిర్వహించటానికి పనుల వివరాలు అందచేస్తే వర్క్ ఆర్డర్స్ ఇస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నా గ్రామాల్లో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముందుకురావటానికి జంకుతున్నారు. 18శాతం జీఎస్టీ చెల్లిస్తే తమకు మిగిలేదేముంది అని వెనుకాడుతున్నారు. దీంతో మండల ఖాతాలో ఉన్న రూ.21కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించడానికి ఇరువర్గాల మధ్య సఖ్యత కుదిరి నా జీఎస్టీ వ్యవహారంతో ముందుకు సాగటం లేదు.



125మందికి కంటి పరీక్షలు

సంతనూతలపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని కూకట్ల కోటయ్య ఫౌండేషన్ చైర్మన్, మాజీ సర్పంచ్ విజయమ్మ ఆధ్వర్యంలో ఒంగోలు స్మార్ట్ ఐ ఆసుపత్రి పర్యవేక్షణలో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 125 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వీరిలో 25 మంది కంటి ఆపరేషన్ ఉచితంగా చేయిస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.నాగమాధురి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కూకట్ల శరత్‌బాబు, నీటిసంఘం అధ్యక్షుడు కాకర్ల చలపతిరావు, టీడీపీ నాయకులు మన్నం సుబ్బారావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, ఎస్.హరినాథ్, చింపిరయ్య తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది


కల్వర్టుపై దెబ్బతిన్న రోడ్డును మరమ్మతులు చేయిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఎండ్లూరు డొంక సమీపంలో మంగళవారం ఎస్ఐ అజయ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు దెబ్బతిన్న కల్వర్టు, స్పీడ్‌బ్రేకర్‌పై తారు రోడ్డు వేయించి మరమ్మతులు చేయించారు. గత ఫిబ్రవరి నెలలో సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్, వేంకటేశ్వర స్వామి ఆలయం, చెరువుకట్ట సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ల ప్రదేశంలో ఏర్పడిన గుంతలను ఎస్ఐ అజయ్‌బాబు మరమ్మతులు చేయించారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే కర్నూల్‌రోడ్డుపై పోలీసులు స్వయంగా మరమ్మతులు చేయించడంపై పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెకానిక్‌ల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

ఏపీ టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మెకానిక్‌ల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మ కోరారు. మంగళవారం అమరావతిలో కార్మికశాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడును కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మెకానిక్‌లకు ప్రమాద బీమా, సాధారణ మరణంలో ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరారు. అలాగే 55 సంవత్సరాలు వయస్సు దాటిన పేద మెకానిక్‌లకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రతి నెలా రూ.5వేలు పెన్షన్ అందజేయాలని, ప్రతి జిల్లాలో కార్మిక భవన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనిపై గంధం చంద్రుడు మాట్లాడుతూ మెకానిక్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి షేక్ జుబేర్, మంగళగిరి నుంచి జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరాజు, టౌన్ జాయింట్ సెక్రటరీ అజయ్ తదితరులు కార్మిక శాఖ అదనపు కార్యదర్శిని కలిసిన వారిలో ఉన్నారు.


చంద్రుడుకు బొకేను అందజేస్తున్న ధర్మ

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

చీమకుర్తి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌ను రద్దు చేసి పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం చీమకుర్తిలో మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు పూసపాటి వెంకట్రావు, పి.ఆంజనేయులు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు దళారి వ్యవస్థలకు అప్పచెప్పటం ద్వారా వారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. గత సమ్మెకాల ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలేటి ఏడుకొండలు, పాటిబండ్ల పద్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్-25కు హాజరయ్యే విద్యార్థులకు బుధవారం నుంచి ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు తరగతులు జరగనున్నాయి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాలూకా పోలీస్‌స్టేషన్‌లో చలివేంద్రం

ఒంగోలు క్రైం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సీఐ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవులో ఒంగోలు తహసీల్దార్

ఒంగోలు(రూరల్), ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండల తహసీల్దార్ ఎస్.వాసు మంగళవారం నుంచి వచ్చే సోమవారం వరకు సెలవు పెట్టారు. అయితే ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎవరికీ బాధ్యతలు ఇవ్వకపోవడంతో పలు పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ ఇన్‌చార్జి బాధ్యతలు మరొకరికి ఇచ్చి ఇబ్బందిలేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో రాష్ట్ర కమిటి పిలుపు మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ చైర్మన్ కె.ఎర్రయ్య, సెక్రటరీ జనరల్ రఫీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ పీఆర్సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, 20శాతం ఐఆర్ ప్రకటించాలని, మిగిలిన ఆర్థిక బకాయిలు, జడ్పీ పీఎఫ్ లోన్లు, సరెండర్‌లీవ్ బకాయిలు విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ధర్నా, చర్చి సెంటరులో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రఘురాం, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు భారం కానున్న ట్రాక్టర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లు ఆర్థికభారం కానున్నాయని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ చర్య మంచిదే అయినప్పటికీ పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటికే చెత్త రిక్షాలు మరమ్మతులకు గురైతే నిధులు లేక అవి మూలన పడేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేని స్థితిలో పంచాయతీలు ఉంటే ట్రాక్టర్ డ్రైవర్ జీతం, డీజల్‌లాంటి ఖర్చులను భరించే పరిస్థితి లేదన్నారు.

ఉగాది పురస్కారం ప్రదానం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు ఎల్‌సీఈఎస్ కళానిలయం సంస్థ జాతీయ ఉగాది పురస్కారం, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పురస్కారాలను అందజేశారు. మంగళవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టర్ కొలకలూరి రవిబాబు, నర్సింగోలు శ్రీనివాసప్రసాద్, మౌర్య, పలువురు వేదపండితులు ఈ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాధవరావును పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పేస్‌లో అవగాహన సదస్సు


ప్రొఫెసర్ రమేష్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్విచిగేర్ అండ్ ప్రొటెక్షన్ అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కొండూరి రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. స్విచ్‌గేర్ ప్రొటెక్షన్ అవశ్యకతను, వాటిలో వచ్చిన నూతన మార్పులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, మద్దిశెట్టి కళ్యాణ్, విభాగాధిపతి నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

ఒంగోలు క్రైం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన పేర్నమిట్టలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. పేర్నమిట్టకు చెందిన తన్నీరు అంకమ్మరాజుతో సాయిజ్యోతికి 2010లో వివాహం అయింది. వారికి ఇరువురు సంతానం. అంకమ్మరాజు వాటర్‌ట్యాంక్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. అయితే భర్తపై సాయిజ్యోతి అనుమానం పెంచుకుంది. దీంతో వారి మధ్య తరచూ వాగ్వాదాలు జరిగేవి. ఈక్రమంలో తాము నివాసం ఉండే పెంకుటింటిలో ఉన్న దంతేలకు చీరతో ఉరేసుకొని సాయిజ్యోతి ఆత్మహత్నాయత్నం చేసింది. ఇది గమనించిన ఇరుగు పొరుగు వారు వచ్చి ఆమెను కిందకు దించి చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఆసుపత్రికి తరలించారు. సాయిజ్యోతి సోదరుడు నరేంద్ర ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ముగిసిన పది పరీక్షలు


పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్కాపురం పట్టణంలో మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 17 నుంచి ప్రారంభమైన పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ఎస్సీ బీసీ కాలనీ, పీఎస్ కాలనీలలోని మున్సిపల్ హైస్కూల్, భాష్యం పాఠశాల, సాయిబాలాజీ ఉన్నత పాఠశాల, ఓంసాయి వికాస్ ఉన్నత పాఠశాల, వివేకానంద హైస్కూల్, శ్రీచైతన్య పాఠశాల, నారాయణ పాఠశాలతో పాటు దరిమడుగు, రాయవరం, గజ్జలకొండ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలతో కలిపి మొత్తం 14 కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు రాసిన విద్యార్థులు ఆనందోత్సవాలతో ఆయా కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయినముక్కుల గ్రామంలో సీతారామాలయంలో నిర్మాణ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కాకర్ల ప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జానకిరాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్థులతోపాటు పాటు పరిసర గ్రామ ప్రజలు పాల్గొని కల్యాణ క్రతువును తిలకించారు. 'జై శ్రీరామ్' అంటూ భక్తితో రామనామాన్ని జపిస్తూ స్వామివార్లను సేవించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్టీల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. పూలసుబ్బయ్య కాలనీ, ఎస్టీ కాలనీలను మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. కాలనీలోని సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారంలో తమవంతు కృషి చేస్తామన్నారు.

అవీ..ఇవీ

టైరు పగిలి మిర్చి ఆటో బోల్తా



బోల్తాపడిన మిర్చి ఆటో

త్రిపురాంతకం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మిర్చి లోడుతో వెళుతున్న ఆటోకు టైరు పగలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని అన్నసముద్రం మెట్ట సమీపంలో మంగళవారం చోటు చేసుకొంది. త్రిపురాంతకం వైపు నుంచి గుంటూరు మిర్చియార్డుకు మిర్చిబస్తాల లోడుతో వెళుతున్న ఆటోకు టైరు పగిలింది. వేగం అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. అదృష్టవశాత్తు ఆటోలోని ఎవరికీ ప్రమాదం జరుగలేదు. గమనించిన స్థానికులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పడిపోయిన ఆటోను ట్రాక్టరు సహాయంతో లేపి, మిర్చి బస్తాలను ఆటోలో లోడు చేశారు.

వీధిలైట్లు వెలగక ఇక్కట్లు

గిద్దలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజానగర్, దానిపక్కనే ఉన్న జగనన్నకాలనీలో చాలాచోట్ల వీధిలైట్లు వెలుగక ఆప్రాంత ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. కొండపక్కనే ఈ ప్రాంతం ఉండడంతో రాత్రివేళలో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలలోని పలుచోట్ల కొన్ని రోజులుగా అక్కడక్కడా వీధిలైట్లు వెలుగడం లేదు. దీంతో రాత్రులందు వృద్ధులు చిన్నారులు రోడ్లపై చిమ్మచీకటిలో నడవలేక భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెలుగని వీధిలైట్ల స్థానంలో కొత్త వీధిలైట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు నిరసన

గిద్దలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఏప్రిల్ 2న మధ్యాహ్నం 2 గంటలకు జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఫించనర్లకు విజ్ఞప్తి చేశారు. పీఆర్‌సీ, ఐఆర్, డీఏ, సరెండర్ లీవ్స్, సీపీఎస్ అరియర్స్ వంటి మొండిబకాయిల సాధన కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఫ్యాప్టో శాఖ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు
- ఎర్రగొండపాలెంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



పింఛన్ నగదు అందజేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలోని చైతన్యనగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీన వృద్ధులకు దివ్యాంగులకు ప్రభుత్వం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. వృద్ధ మహిళల కళ్లలో సంతోషం వ్యక్తమౌతోందన్నారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, తలసేమియా బాధితులకు రూ.15 వేలు, మూత్రపిండాల డయాలసిస్ రోగులకు రూ.10 వేలు వంతున పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎర్రగొండపాలెం మండలంలో 8277మంది లబ్ధిదారులకు నెలకు రూ.3.60 కోట్లు పింఛన్ల సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో సాయత్రం 7 గంటల లోపు 94 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాజశేఖరరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీను, చిట్యాల వెంగల్‌రెడ్డి, తోట మహేష్, మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, ఓర్సు వెంకటేశ్వర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఫించన్ల పంపిణీ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజాసంక్షేమం, నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బైలడుగు బాలయ్యయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, సర్పంచ్ పసుపుల మల్లేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండవ నెలలోనూ వృద్ధుడికి అందిన పింఛన్



పింఛన్ నగదు అందజేస్తున్న శ్రీనివాసులు

కంభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ అందక ఇబ్బందులు పడుతున్న వృద్ధుడికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెండవ నెలలోనూ రూ.4 వేల పింఛన్ అందజేశారు. రెండు నెలలక్రితం కంభంలో జరిగిన ప్రజాదర్బార్‌లో అర్బన్ కాలనీకి చెందిన రాచపూటి కృష్ణ అనే 70 సంవత్సరాల వృద్ధుడు హాజరయ్యారు. తాను ఒంటరి వాడినని, తనకు పింఛన్ ఇవ్వడం లేదని, పూటగడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సొంతంగా పింఛన్ అందచేస్తానని, నూతన పింఛన్ మంజూరయ్యే వరకు ఇస్తానని తెలిపారు. ఆ మేరకు ఏప్రిల్ నెల కూడా రూ.4వేల పింఛన్‌ను అర్బన్ కాలనీలో టీడీపీ మండల అధ్యక్షుడు తోట వెంకటశ్రీనివాసులు ద్వారా అందజేశారు.

కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదు

గిద్దలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి మాట్లాడుతూ గతప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయకుండా ఆప్కాస్‌లో చేర్చి మోసం చేసిందని నిరసన వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి మళ్లీ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పచెప్పాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ అమలు వలన కార్మికులకు లాభ, నష్టాలు రెండూ ఉన్నాయన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే వేతనాలు, పీఎఫ్ ఆలస్యమవుతాయన్నారు. ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆలోచనలు మానుకుని కార్మికులందరినీ కూటమి ప్రభుత్వం పర్మినెంట్ చేసి ఆదుకోవాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పాపయ్య, చంటెయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో సీతారామస్వామి



కూర్మావతారంలో స్వామివారు

గిద్దలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబద్వేల్ రోడ్డులోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కె.రాధాక్రిష్ణ, చీతిరాల విజయభాస్కర్‌రావు, పల్లె.చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి జరిగిన అభిషేకం, అర్చన, కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భగవద్గీత 15వ అధ్యాయంపై మహిళలకు కంఠస్థ పోటీలు నిర్వహించారు. విజేతలకు వరసగా రూ.2000, రూ.1500, రూ.1000 నగదు బహుమతులను భగవద్గీత ప్రచారసేవాశ్రమం నిర్వాహకులు సత్య జ్ఞానా నంద అందజేశారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు విఠా సుబ్బరత్నం, రాచపూట నరసింహారావు, శివపురం వెంకటరామయ్య, శివపురం అనంతరావు, మోటపోతుల రాంభూపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో గిద్దలూరు మొదటి స్థానం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూళ్లలో గిద్దలూరు నగర పంచాయతీ మొదటి స్థానంలో నిలిచిందని దీంతో నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని పన్నులకు సంబంధించి రూ.4.67 కోట్లు వసూలు లక్ష్యం కాగా రూ.3.47 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. 73.37 శాతం వసూళ్ల చేసి జిల్లాలో గిద్దలూరు నగర పంచాయతీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. తద్వారా రాష్ట్రంలో 17వ స్థానంలో ఉందన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.38లక్షలు అధికంగా వసూలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటించిన నాటి నుండి 47.27 లక్షలు వసూలు కాగా చివరి రోజు అయిన మార్చి 31వ తేదీ ఒక్కరోజే రూ.16.86 లక్షలు పన్ను చెల్లించారన్నారు. పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్ను చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధికి తోడ్పడతారని, పన్ను వసూళ్లకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

బ్యాంకు ఉద్యోగాలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని రామానుజన్ అకాడమీ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్(రేస్) కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ముగ్గురికి బ్యాంకు ఉద్యోగాలు లభించాయి. బీపీఎస్ ప్రకటించిన ఫలితాలలో తమ సంస్థలో శిక్షణ పొందిన షేక్ సోహెల్ అహమ్మద్, షేక్ యూనుస్, ఎం.వెంకటేశ్వర్లు ఉద్యోగాలు పొందారని సంస్థ గౌరవ సలహాదారు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ మంగళవారం తెలిపారు. సోహేల్ అహమ్మద్ బ్యాంకు ఆఫ్ మహరాష్ట్రలో క్లర్క్‌గా, యూనుస్ కెనరా బ్యాంకులో ప్రొబిషనరీ ఆఫీసర్‌గా, వెంకటేశ్వర్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రిజర్వ్ లిస్టులో క్లర్క్‌గా ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, వెంకట్, సుబ్బయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించాలి



పశువైద్యశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న జేడీ బేబీరాణి

కొనకనమిట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో పశుపోషకులు పశువులకు గ్రాసం కొరత లేకుండా చూడాలని, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ బేబీరాణి అన్నారు. మండల కేంద్రం కొనకనమిట్లలోని పశువైద్యశాలను ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో పాలాన పశువులకు తగినంత మేత దొరకదన్నారు. కావున పశువులకు గ్రాసం కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం రాయితీపై గడ్డిజొన్నలతో పచ్చిమేత పెంచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పశుపోషకులకు గడ్డిజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. వేసవికాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పశువైద్యశాలలో నీటితొట్టి ఏర్పాటు చేసి నిత్యం నీళ్లు ఉండేలా చూడాలన్నారు. మండలంలోని పెదారికట్ల, గొట్లగట్టు వైద్యశాలలో నీటితొట్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం వైద్యశాలలో పలురికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అమూల్య, వెట్నరీ అసిస్టెంట్ పూర్ణచంద్రరావు, సిబ్బంది పిల్లి.నాగార్జునరెడ్డి, పలువురు పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : రేంజర్



ప్రజలతో మాట్లాడుతున్న రేంజర్

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజివారిపల్లి గ్రామ సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలోని పరిసరాలను ఫారెస్టు రేంజర్ సుబ్బారావు తన సిబ్బందితో మంగళవారం పరిశీలించారు. పంటపొలాల్లోకి పెద్దపులి సంచారం అంటూ వచ్చిన సమాచారంతో సోమ, మంగళవారం పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం నీటి కోసం పంటపొలాల్లోకి పులి వచ్చినట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రివేళల్లో పొలాల్లోకి, అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని సూచించినట్లు తెలిపారు. అత్యవసరం అయితే మినహా అది కూడ ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. ప్రస్తుతానికి ఏటువంటి ప్రమాదం లేదని అన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు.

నష్టపరిహారం చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న రేంజి అధికారి

పెద్దదోర్నాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పెద్దపులిదాడిలో మృతిచెందిన పశువుల యజమానులకు నష్టపరిహారం చెక్కులను రేంజి అధికారి జీవన్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. నల్లమలలో నివాసముంటున్న చెంచుగిరిజనుల పశువులు అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన సమయంలో పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఈ నేపథ్యంలో వారికి ఆర్థిక తోడ్పాటునిస్తూ అటవీ శాఖాధికారులు నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. చింతలకు చెందిన కుడుముల పోతయ్యకు రూ.20 వేలు, కుడుముల పెద్దక్కకు రూ.15వేలు, కుడుముల హనుమక్కకు రూ.15వేలు, భూమని హనుమక్కకు రూ.20 వేలు, కుడుముల బయన్నకు రూ.15 వేలు, బోడేనాయక్ తాండాకు చెందిన శ్రీనునాయక్‌కు రూ.20 వేలు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీట్ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

పశువుల తొట్ల ఏర్పాటుకు శంకుస్థాపన




శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన పశువుల తొట్టికి టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. మంగళవారం కవలకుంట్లలో మంజూరైన పశువుల పాక, తొట్టిలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల దాహం తీర్చేందుకు రూ.32వేలతో పశువుల తొట్టిలను ప్రభుత్వం నిర్మిస్తోం దన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు మాజీ సర్పంచి నారు వెంకటరెడ్డి, సర్పంచి ఆవుల వెంకటరెడ్డి, నాయకులు నారు వెంక్రటామిరెడ్డి, శనగా వెంకటేశ్వరరెడ్డి, నారు బాలవెంకటరెడ్డి, నారు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో పశువుల దాహార్తిని తీర్చే పశువులతొట్లు

కొమరోలు : వేసవిని దృష్టిలో ఉంచుకుని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితోట్లను ఏర్పాటు చేయడం శుభపరిణామం అని ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని సర్వేరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన పశువులతోట్ల నిర్మాణాలకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం మనుషులకే కాకుండ మూగజీవాల అభివృద్ధికి చర్యల్లోభాంగా వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకుని పశువులు జీవించేందుకు పశువులకు తోట్లను నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వార నిర్మింస్తున్నారన్నారు. ఒకొక్క పవువుల తోట్టిని రూ.33వేలతో నిర్మించి ఆయా పంచాయతీల ద్వార నీటి సరఫరానుకూడా ఏర్పాటుచేస్తున్నారు. మండలంలో 28 పశువుల తోట్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వార నిర్మించే తోట్లను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటి నిర్మాణానికి ఆయా గ్రామాల్లోని ఉపాధి కూలీల ద్వారనే నిర్మిణాలు చేపడతామన్నారు. కార్యాక్రమంలో ఏపీఓ మహాలక్ష్మి, టీఏలు , సిబ్బది పాల్గోన్నారు.

పశువులకు దాహార్తి తీర్చేందుకే నీటి తొట్లు : ఎంపీడీవో



పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో

పెద్దదోర్నాల : వేసవిలో పశువులకు దాహార్తి తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణాలు ఉపకరిస్తాయని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో నీటితొట్ల నిర్మాణానికి ఎంపీడీవో మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం వినయ్‌కుమార్, ఈసీ చాణక్య, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, దొడ్డా శేషాద్రి, చంటి, షేక్ మంజూర్‌భాష తదితరులు పాల్గొన్నారు.

అవ్వా తాతల్లో ఆనందం


పీసీపల్లి: వెంగళాయపల్లిలో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

» ప్రతి గ్రామంలో పింఛన్‌ల పంపిణీ

పీసీపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వం ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పింఛన్ అందుకునేటప్పుడు అవ్వా తాతల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయపల్లిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీచేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేల పింఛన్‌ను రూ.వెయ్యి పెంచి రూ.నాలుగు వేలు ఇస్తుందన్నారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులుంటే వారికి కూడా ప్రభుత్వం కొత్తగా పెన్షన్‌లను మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం తిరుపతయ్య, ఎంపీడీవో ప్రభాకారశర్మ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరిరామయ్య, చంద్రయ్య, తిరుపతిరావు, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ ధ్యేయం

ముండ్లమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని నాయుడుపాలెం, పెదరావిపాడు గ్రామాల్లో పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయంతో సీఎం చంద్రబాబు ఎంతో కష్ట పడుతున్నారన్నారు. ఒకవైపు సంక్షేమ ఫలాలు అందిస్తూనే మరోవైపు అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ - 6 పథకాల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇప్పటికే 80 శాతం నెరవేర్చారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రమంతా గోతులమయంతో ప్రజలు ప్రయాణించ లేక ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు కేటాయించి రహదారులకు మరమ్మతులు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. దర్శిని రాష్ట్రంలోనే నెంబరు - 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతి గ్రామంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్టిలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. అనంతరం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను మాజీ సర్పంచ్ బద్రి గోపాలరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఏపీడీ లలితకుమారి, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, దారం సుబ్బారావు, సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు, మాజీ జడ్పీటీసీలు కొక్కిర నాగరాజు, వరగాని పౌలు, శంకరాపురం, వేముల సర్పంచ్‌లు కూరపాటి నారాయణ స్వామి, గజ్జల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, పాల్గొన్న టీడీపీ నాయకులు, అధికారులు

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

దర్శి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. మంగళవారం దర్శి పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లు, జీతాలు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి ఉండేదన్నారు.

కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, సంగా తిరుపతిరావు, జూపల్లి కోటేశ్వరరావు, నారపుశెట్టి మధు, బేళ్ల శ్రీనివాసరావు, ఊరుబిండి మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే పెద్దపీట

తాళ్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో వారు పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సిఎం చంద్రబాబు పింఛన్లు పెంచి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో దారా హనుమంతరావు మాట్లాడుతూ మండలంలో 6142 పెన్షన్లు ఉండగా, మొదటి రోజు 5581 పెన్షన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. తాళ్లూరులో టీడీపీ నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల శ్రీను, వెలుగువారిపాలెంలో శాగం కొండారెడ్డి, ఆయాగ్రామాల్లో పార్టీ నేతలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు.


ముండ్లమూరు: నాయుడుపాలెంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

పామూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నట్టు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామంలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయాలన్నారు.


తాళ్లూరు: వెలుగువారిపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

దర్శి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పథకాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం చినగంజాం మండలం గొల్లపాలెంలో పింఛన్ల పంపిణీలో పాల్గొనేందుకు వచ్చిన సీఎంను ఆమె కలిశారు. ఈసందర్భంగా గత ప్రభుత్వ అసమర్థతతో నిలిచిన పెండింగ్ ప్రాజెక్టులను వివరించారు. అన్న క్యాంటీన్ భవనాన్ని పూర్తిచేసి ప్రారంభించేందుకు నిధులు విడుదల చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.

జాతీయస్థాయి డ్రైవింగ్, శిక్షణ పరిశోధన కేంద్రం, దర్శి-దొనకొండ డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు ఆమె వివరించారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసి దర్శి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.


సీఎం చంద్రబాబును కలిసి మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పక్కన మంత్రి గొట్టిపాటి రవికుమార్

సీఎంను కలిసినవారిలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నారు.

పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

కనిగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ రూల్స్ సవరణ ఆమోదం దుర్మార్గమని ఏపీ ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ప్రధానకార్యదర్శి నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో భవనంలో జరిగిన పెన్షనర్‌ల సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉభయసభల్లో ఆమోదింపచేసిన పెన్షన్ సవరణ బిల్లు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు ప్రమాదంగా మారిందన్నారు. ఈ సవరణ చట్టం బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందితే 50లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 65లక్షల మంది పెన్షనర్‌లకే గాక దేశ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు ఉరితాడుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పెన్షన్ సవరణ బిల్లును నేరుగా పార్లమెంట్‌లో ప్రవేశపెడితే అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయంతో ఆర్థిక బిల్లులో చేర్చి ఆమోదింప చేసుకోవటం అన్యాయమన్నారు. ఇక నుంచి రెండు రకాల పెన్షన్‌లు అమలులోకి తెచ్చేందుకే కేంద్రం చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. పెరిగిన ధరలు, మారుతున్న కాలంతో సంబంధ లేకుండా ఇచ్చే పెన్షన్ వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నట్టు చెప్పారు. పెన్షన్ సవరణ బిల్లు ఉపసంహరించుకోకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌ల సంఘాలు పెద్ద ఎత్తున తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తారని హెచ్చరించారు.

సమావేశంలో పెన్షనర్‌ల సంఘం నాయకులు ముక్కు వెంకటరెడ్డి, నాగభూషణం, మీగడ వెంకటేశ్వరరెడ్డి, వీ మాలకొండారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చెన్నయ్య, గౌస్ మొహిద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, యర్రారెడ్డి, జీ కృష్ణమూర్తి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణం

తాళ్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి పథకం కింద పశువుల తొట్టిలు నిర్మాణం చేస్తున్నట్టు ఎంపీపీ తాటికొండ శ్రీనివారావు తెలిపారు. వెలుగువారిపాలెం గ్రామ పంచాయతీ గంగపాలెం పొలాల్లో నిర్మిస్తున్న పశువుల తొట్టి నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయతీల్లో పశువుల తొట్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ కోటేశ్వరరమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టిలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని టీడీపీ నియోజకవర్గ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పడమట కట్టకిందపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించే నీటి తొట్టిల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువుల నీటి తొట్టిల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీవో బి.మాల్యాద్రి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గట్లా కొండారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు డీకాల చిన్నమ్మి, బద్దిపూడి యాకోబు, నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాళ్లూరులో స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

తాళ్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులో సైడు కాలువను ఆక్రమించిన వ్యాపారస్తులు కొందరు మంగళవారం స్వచ్ఛందంగా తొలగించారు. మరికొందరు వ్యాపారస్తులు తమకేమిపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కాలువలను ఆక్రమించి కొందరు వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో వారం క్రితం గ్రామ పంచాయతీ నోటీసులు అందజేశారు. సైడు కాలువలను ఆక్రమించి ముందుకు వచ్చిన వ్యాపారస్తులు ఆక్రమణలు తీసివేయాలని, లేకుంటే పంచాయతీ ఆధ్వర్యంలో తొలగిస్తామని పేర్కొన్నారు. నాలుగు పర్యాయాలు గ్రామంలో మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఆక్రమణదారులు తొలగించకపోవటంతో గ్రామ పంచాయతీ ఆక్రమణలను తొలగించేందుకు మంగళవారం ఉదయం ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్, సిబ్బందిని సిద్ధం చేశారు. దీంతో బ్యాంక్ వద్ద వ్యాపారి స్వచ్ఛందంగా తమ బంకును, రేకులను తొలగించారు. ఇద్దరు, ముగ్గురు మాత్రం తూతూ మంత్రంగా రేకులను తీసివేశారు. ఎక్కువ మంది వ్యాపారస్తులు మాత్రం గ్రామపంచాయతీ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారు. గ్రామపంచాయతీ రంగప్రవేశం చేసి అన్ని వీధుల్లో కాలువలపై ఆక్రమణలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులు స్వర్ణ దస్తూరిని అలవాటు చేసుకోవాలి

కనిగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్వర్ణ దస్తూరిని అలవాటు చేసుకోవాలని లెటర్స్ హ్యాండ్ రైటర్, ఉపాధ్యాయిని కవిత అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎం సంజీవి ఆధ్వర్యంలో మంగళవారం కాలిగ్రఫీ బోర్డు ద్వారా విద్యార్థులకు స్వర్ణ దస్తూరిలోని మెలకువలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ ఫోర్ రూళ్ళ నోట్‌బుక్‌లో రైటింగ్‌ను ప్రాక్టీస్ చేస్తూ ఉంటే మంచి దస్తూరి అలవాటు అవుతుందన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో మానసిక పరిజ్ఞానం పెంపొంది ప్రశాంతంగా విద్యను అభ్యసించటం అలవాటు అవుతుందన్నారు. పరీక్షల్లో మంచి దస్తూరితో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో పద్మజా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కలిగిన ప్రతిరైతు సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో బి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. సీఎస్‌పురం మండలంలోని పద్ద గోగులపల్లి జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ పక్రియను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్టు చెప్పారు. తద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయడమే ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుడు వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

రెండు దేవాలయాల్లో చోరీ

దర్శి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంకోజనపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో, తూర్పు వెంకటాపురం శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దుండగులు ఆలయాల్లో హుండీలను పగులగొట్టి సుమారు రూ.20 వేల కానుకలను అపహరించారు. ఈ ఆలయాలు ఊరికి బయట ఉండటంతో రాత్రి పూట జరిగిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. దర్శి ఎస్సై మురళి ఆలయాల్లో జరిగిన ఘటనలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పామూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి బుధవారం ఒంగోలులో ఫ్యాక్టో ఆధ్వర్యంలో జరుగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పామూరు జోన్ నాయకులు షేక్ నాయబ్‌రసూల్, వై.రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం పామూరులో జరిగిన సమా వేశంలో వారు మాట్లాడారు. 176 నెలల డీఏ బకాయిలు, సరెండర్ లీవు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్యాక్టో నాయకులు బి.వెంగళరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు. పామూరు, సీఎస్‌పురం ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పామూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలం దివాకరపురం గ్రామంలో బుధవారం జరగనున్న బయోగ్యాస్ భూమిపూజ కార్యక్రమంలో మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకానాయుడు బాబు పిలుపునిచ్చారు. కనిగిరి నియో జకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్ర చేస్తున్న కృషితోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు.



బత్తుల జాలమ్మ కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



యల్లావుల రమ్య కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అనగాని, పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే సాంబశివరావు





చంద్రబాబుతో వస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వరాల జల్లు

- మోడల్ గ్రామంగా కొత్తగొల్లపాలెం
- తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు
- మోటుపల్లిలో కీలక ప్రాజెక్టుల సాధనకు కృషి
- కృష్ణా పశ్చిమ డెల్టా కొమ్మమూరు కాల్వ ఆధునికీకరణకు రూ.5 కోట్లు ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఏలూరిపై సీఎం ప్రశంసలు
- కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

చినగంజాం మండలం కొత్తగొల్లపాలేన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం.. తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు.. మోటుపల్లి తీరంలో కీలక ప్రాజెక్టుల సాధనకు కసరత్తు.. కాల్వల ఆధునికీకరణకు రూ.5 కోట్లు, పర్చూరు నియోజకవర్గంలో రోడ్లు, 11 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ఆధునికీకరిస్తాం.. ఇలా జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. సామాజిక పింఛన్ల పంపిణీ కోసం మంగళవారం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలేనికి ముఖ్యమంత్రి వచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రజలు సమస్యలు వినడమే తరువాయి వెంటనే వాటి పరిష్కారం కోసం కలెక్టర్‌కు ఆదేశాలివ్వడం, ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలకు మోక్షం కలిగేలా వరాలు కురిపించారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్ నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ జిల్లాలోని కొత్తగొల్లపాలేన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సందర్శించారు. ఐదు గంటలపాటు గ్రామంలోనే ముఖ్యమంత్రి ఉన్నారు. ఈ సందర్భంగా కొత్తగొల్లపాలేనికి సీఎం వరాల జల్లు కురిపించారు. రెండేళ్లలోనే గ్రామం రూపురేఖలను మార్చుతామన్నారు. 2029 కల్లా గ్రామంలో పేదరికం కనుమరుగవ్వాలన్నారు. ఆదర్శం గ్రామంగా తీర్చిదిద్ది రాష్ట్రానికే నమూనా చేస్తామన్నారు. గ్రామంలో వచ్చిన వినతులపై సీఎం సానుకూలంగా స్పందించారు. పింఛన్ ఇవ్వడానికి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సీఎం అక్కడికక్కడే ఓ కుటుంబానికి ఇంటి మంజూరుతో పాటు బీసీ కార్పొరేషన్ కింద రుణం మంజూరుకు కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. పశువుల దాణాలాగా జీవాల పోషకులకు ఇంటి దగ్గరే మేతను ఏర్పాటు చేయడంతో పాటు వారికి షెడ్లు కట్టి ఇచ్చే అంశంలో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్ వెంకటమురళిని ముఖ్యమంత్రి ఆదేశించారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కొమ్మమూరు కాల్వల ఆధునికీకరణకు రూ.5 కోట్లు అదనంగా విడుదల చేస్తున్నట్లు సీఎం తెలిపారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.14 కోట్లు విడుదలకు అనుమతిచ్చారు. మోటుపల్లి తీరంలో ప్రతిపాదనల దశలో ఉన్న నౌక నిర్మాణ పరిశ్రమను సాధనకు హామీ ఇచ్చారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పర్చూరులో తీవ్ర వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు 11 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ఆధునికీకరించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న నాగార్జునసాగర్ కాల్వల మరమ్మతులతో పాటు కాల్వల ఆధునికీకరణకు నిధులను త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా రూ.9 కోట్లతో జాతీయ రహదారి నుంచి వలపర్ల ఇండస్ట్రియల్ పార్కు వరకు డబుల్ రోడ్డు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు.

మారుమూల గ్రామానికి రావడం అదృష్టం

సీఎం చంద్రబాబునాయుడు తన నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామమైన కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీకి వేదిక చేసుకోవడంపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరికి ఉన్న కమిట్‌మెంట్ గొప్పదని సీఎం అన్నారు. వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించారని, సొంతంగా ఎదిగి ఆ తర్వాతే రాజకీయాల్లోకి వచ్చిన అతి కొద్దిమందిలో ఏలూరి ఒకరని ప్రశంసించారు. తనను ఎంపీని చేయడంతో పాటు లోక్‌సభలో ప్యానెల్ స్పీకర్ చేసిన సీఎం చంద్రబాబుకు కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పటి నుంచి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో తనకు అనుబంధం ఉందని సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారని చంద్రబాబు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రవికుమార్, సత్యప్రసాద్, బాలవీరాంజనేయస్వామి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, నరేంద్రవర్మ, కొండయ్య, ఆనంద్ బాబు, తదితర నేతలు పాల్గొన్నారు



గ్రామంలో పింఛన్ లబ్ధిదారు సుభాషిణి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కలెక్టర్ వెంకట మురళి



ఇంటి పరిసరాలను పరిశీలిస్తూ..



వృద్ధుడి సమస్య వింటూ..

1 పనితీరు ఆధారంగా రేటింగ్

ఎమ్మెల్యేలు, నేతలు ఇంకా మెరుగుపడాలి

'నాతో సహా అందరి పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి పనితీరు ఆధారంగా రేటింగ్ ఇవ్వడం జరుగుతుంది. పనితీరు పేలవంగా ఉన్న ఎవరైనా సరే తీరు మార్చుకోవాల్సిందే. ప్రస్తుతం ఉన్న నివేదికలను పరిశీలిస్తే ఎమ్మెల్యేలు, నేతల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉంది..' అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. కొత్తగొల్లపాలెంలో జరిగిన పార్టీ క్యాడర్ సమావేశంలో సీఎం మాట్లాడారు. ఎంతటి గొప్ప నేతలైనా సరే వారి పనితీరు మెరుగ్గా ఉండాలన్నారు. లేని పక్షంలో మరికొంత సమయం ఇచ్చి చూస్తానని అప్పటికీ మార్పు లేకపోతే వేరే వారికి అవకాశం కల్పిస్తానని తేల్చిచెప్పారు. టీడీపీ అంటేనే సమర్థవంతమైన నాయకత్వానికి కర్మాగారం వంటిదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలే ప్రామాణికంగా పదవులు ఇవ్వబోనని తెలిపారు. కార్యకర్తలు జెండా మోసి పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారని, వారిని అన్ని విధాల పైకి తీసుకొచ్చే బాధ్యత తనదేనన్నారు. వారి సంక్షేమం కోసం పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యకర్తలను క్రమశిక్షణతో ఉంచే ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. రానున్న నాలుగేళ్లలో అన్ని నియోజకవర్గాల్లో తిరిగి కార్యకర్తలకు అభినందనలు చెప్పే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. నాయకులు కూడా జెండాను మోసిన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మోటుపల్లి పంచాయతీ పరిధిలోని రుద్రామాంబపురానికి చెందిన టీడీపీ కార్యకర్త పద్మ హత్యకు గురికావడంతో ఆమె పిల్లలకు పార్టీ అండగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ వారి పై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేశారని వారిపై చర్యలు తీసుకోవాలని కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా సుబ్బరాయుడు ముఖ్యమంత్రిని కోరారు. ఫాం7 దొంగలపై చర్యలు లేవని, పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై తాము పోరాడుతుంటే అధికారులు వారికి కొమ్ముకాసేలా నివేదికలు ఇస్తున్నారన్నారు. సరైన ధరలు లేక ఇబ్బంది పడుతున్న పొగాకు రైతులను ఆదుకోవాలని పర్చూరు మండల మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి కోరారు.



ప్రజల వద్ద వినతులు స్వీకరిస్తూ..



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే వేగేశన



దివ్యాంగులకు వాహనం అందిస్తూ..



బామ్మ ప్రసంగాన్ని ఆలకిస్తూ..



హాజరైన ప్రజలు

కొటేషన్లతో.. కొట్టేశారు



- కొండెక్కిన వ్యవసాయ యంత్రాల ధరలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.8.56 కోట్లు
- సబ్సిడీ నిధుల్లో అధికారుల జేబుల్లోకి 12 శాతం?
- స్ప్రేయర్ ధర రూ.21 వేలు.. రూ.27 వేలకు బిల్లు



గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఏకమొత్తంగా ఏదైనా వస్తువులు కొనుగోలు చేస్తే వాటి ధర తగ్గుతుంది. ఇక తయారీ సంస్థలనే నేరుగా సంప్రదిస్తే మరిం తగా ధర తగ్గుతుంది. అదే ప్రభుత్వం అనుకుంటే ఇంకా తగ్గాలి. కానీ అదేమిటో కానీ విచిత్రంగా బహిరంగ మార్కెట్లోని ధర కంటే పెరిగిపోతోంది. అధికారుల కమీషన్ల మాయతో ధరలను పెంచేసి లబ్ధిదారులపై భారం మోపుతున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ యంత్రాల పరిస్థితి ఇలాగా ఉంది. రైతు నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తే అదే యంత్రం తక్కువ ధరకు వస్తుంది. అదే వ్యవసాయ శాఖ సబ్సిడీ ద్వారా అంటే రేటు కొండెక్కుతోంది. ఉదాహరణకు తైవాన్ పవర్ స్ప్రేయర్లు మార్కెట్‌లో రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు దొరుకుతున్నాయి. వాటి ధరను వ్యవసాయ శాఖ రూ.27 వేల వరకు నిర్ణయించింది. మండల స్థాయి నుంచి కమిషనరేట్ వరకు కమీషన్లు కలుపుకోవడంతో ఒక్కో యంత్రం ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెరిగింది. 50 శాతం సబ్సిడీ పేరుతో అధికారులు జేబులకు చిల్లు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.8.56 కోట్లు మంజూరు చేసింది. గుంటూరు జిల్లాకు మొత్తం 1727 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, సబ్సిడీ నిమిత్తం రూ.2.91 కోట్లను కేటాయించింది. పల్నాడు జిల్లాలో 1715 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా సబ్సిడీ నిమిత్తం రూ.2.80 కోట్లు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 1719 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, రూ.2.85 కోట్లు సబ్సిడీగా కేటాయించారు.

జీఎస్టీ పేరు చెప్పి..

సబ్సిడీ యంత్రాల ధరలు పెరగడానికి అధికారులు కొత్త భాష్యం చెబుతున్నారు. జీఎస్టీ కారణంగానే ధరల్లో తేడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఏపీ ఆగ్రోస్‌కి రెండు శాతం చెల్లించాల్సి వస్తుందంటున్నారు. అయితే అధికారులు చెబుతున్న కారణాలను రైతులు పట్టించుకునే పరిస్థితిలో లేరు. సబ్సిడీ పేరుతో అధికారులు అవినీతితో తమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

మార్కెట్లో తక్కువ ధర..

ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు సబ్సిడీపై ఏవైతే యంత్రాలు ఇస్తామని చెబుతుందో ఆయా యంత్రాలు బహిరంగ మార్కెట్‌లో చాలా తక్కువ ధరకు వస్తున్నాయి. ఉదాహరణకు రోటావేటర్ మార్కెట్ ధర రూ.1.15 లక్షల వరకు ఉండగా, సబ్సిడీ ధర రూ.1.45 లక్షలుగా నిర్ణయించారు. మిగిలిన యంత్రాలు విలువ కూడా మార్కెట్‌లో చాలా తక్కువగా ఉన్నా సబ్సిడీ పేరు చెబితే ఎక్కువ చెబుతున్నారు. సబ్సిడీ యంత్రాలు సరఫరా చేసేందుకు అధికారులు రాష్ట్ర స్థాయిలో కొటేషన్లు ఆహ్వానించగా ఆ సమయంలోనే కమీషన్లు నిర్ణయం జరిగిందని సమాచారం. దీంతో యంత్రాలకు అసలు ధరకు మించి కొటేషన్లు ఇవ్వాలని ముందుగానే అధికారులు వ్యాపారులకు సూచించినట్లు తెలుస్తుంది. అసలు ధర కన్నా కనీసం 12 శాతం ఎక్కువగా కొటేషన్లు ఉండాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగా కొటేషన్లు ఇచ్చిన వారికి మాత్రమే యంత్రాల సరఫరాకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. వ్యవసాయ యంత్రాల కొనుగోలులో మిగులు సొమ్మును ఎవరికి ఎంత పంపాలన్న దానిపై కూడా పూర్తిగా ఒప్పందం జరిగినట్లు సమాచారం. కింద స్థాయిలోని అధికారుల నుంచి వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఉన్న కొందరు అధికారులకు చేరేలా ప్రణాళికలను రూపొందించారు.

సూర్యలంకలో సందడి

దీక్షల ముగింపుతో తీరానికి పోటెత్తిన ముస్లింలు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరం మంగళవారం ముస్లిం సోదరులతో పోటెత్తింది. నెలరోజులుగా ఉపవాసదీక్షలు చేసి రంజాన్ వేడుకను ఘనంగా జరుపుకున్న ముస్లింకుటుంబాలంతా కలిసి తీరానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తూ సంతోషంగా, సరదాగా గడిపారు. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా రెండు తెలుగురాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులతో తీరం కిక్కిరిసింది. ఇసుక తిమ్మెర్లతో యువత ఆటలాడుతూ సందడి చేశారు. ప్రత్యేక వాహనాలలో తరలి రావటంతో తీరం వెంట బారులు తీరి జనం ఉన్నారు. సుమారు 60వేలమంది వచ్చిఉంటారని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. వాహనాల రాకపోకలతో అక్కడక్కడ కొన్ని అవాంతరాలు తలెత్తాయి. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్, రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్ళు గస్తీ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చూశారు. ప్రతి ఏడాది రంజాన్ వేడుక మరుసటి రోజు తీరానికి పర్యాటకులు రావటం పరిపాటిగా మారింది.




అద్దంకి భవానీ సెంటర్‌లో టీ తాగుతూ స్థానికులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మినీ బైపాస్‌కు త్వరలో నిధులు

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మినీ బైపాస్ రోడ్డుకు త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అవుతాయని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. చినగంజాం మండలంలో సీఎం చంద్రబాబునాయుడు కార్యక్రమానికి హాజరైన ఆయన బుధవారం కనిగిరిలో జరిగే లోకేష్ మీటింగ్‌లో పాల్గొనేందుకు వెళ్తూ మంగళ వారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో కొద్ది సేపు ఆగారు. టీ తాగుతూ స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య విషయాన్ని స్థానిక నేతలు మంత్రి దృష్టికి తీసుకుపోయారు. అద్దంకి మేజర్ కాలువను రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు మినీ బైపాస్‌గా మార్చే క్రమంలో శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్ల సమీపంలో నామ్ రోడ్డులో కలిసే విధంగా మార్పు చేయాలని పలువురు స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో సర్వే చేయించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో ఇంకా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాల గురించి, సైడ్‌డ్రైన్ లలో మురుగు పారుదల లేక పోవటాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. సమస్యలు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు మంత్రి ఫోన్ చేసి చెప్పారు. టీడీపీ నేతలు కాకాని అశోక్, లహరి, కోనేటి అనిల్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, మాబూ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనగర్‌లో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సిమెంట్ బల్లల ఏర్పాటు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాదచారులు, ప్రజలు వినియోగించుకునేందుకు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ రెండోలైన్‌లో మూడు బల్లలు, వీఎస్ఎస్ అపార్ట్‌మెంట్, నాగులపాడు రోడ్డులో 5 సిమెంట్ బల్లలు పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, డాక్టర్ యు. దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, చిన్ని కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలమూరికి సత్కారం

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉగాది పురస్కారం అందుకున్న శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ పూజారి వేలమూరి శ్రీరామచంద్రమూర్తిని అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మ ణ సేవా సంఘం అధ్యక్షుడు శ్రీపతి రంగనాథాచార్యులు, ఆరామ క్షేత్రం కన్వీనర్ లక్కరాజు చంద్రశేఖర్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యురాలు జమ్మలమడక రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పూజారి వేలమూరి శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

బహుజనుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అమరావతి బహుజన జేఏసీ చైర్మన్ పోతుల బాల కోటయ్యను మంగళవారం విజయవాడలో ఏపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక సభ్యులు కలిశారు. రాష్ట్రంలోని దళితులు, బహుజనుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని ఐక్య వేదిక సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, కమిటీ సభ్యులు కొనిదల విజయ్‌కుమార్, దాసరి బాలకృష్ణ, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


దైవాలరావూరులో ముమ్మన సాంబశివరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్ తదితరులు

టీడీపీ నేత కుటుంబానికి మంత్రి పరామర్శ

మేదరమెట్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలరావూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు ముమ్మన నరసింహారావు సోదరుడు సాంబశివరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దైవాలరావూరు వచ్చి సాంబశివరావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మృతికి కారణాలను అడిగి తెలుసుకొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇంకొల్లు ప్రాంత అభివృద్ధి చర్చపై ప్రజల హర్షం

ఇంకొల్లు,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చినగంజాం మండలంలోని కొత్తగొల్లపాలెంలో మంగళవారం జరిగిన ప్రజావేదికలో సీఎం చంద్రబాబు దృష్టికి నియోజకవర్గంలోని సమస్యలతో పాటు ఇంకొల్లు ప్రాంతంలో ఉన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీసుకెళ్లడంపై ఈప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు మీదుగా గుంటూరు నుంచి నాగులుప్పలపాడు వరకు నాలుగులైన్ల రహదారిగా అభివృద్ధి,ఇంకొల్లులో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజి, ఆటోనగర్ ఏర్పాటు, ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించాలని చంద్రబాబును కోరడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తపరిచారు.

దాతలకు ప్రేరణ.. పేదలకు భరోసా

పర్చూరు నియోజకవర్గం అభివృద్ధికి నిర్దిష్ట హామీలు

పాలనా, పార్టీ వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఏలూరికి కితాబు

వినూత్నంగా సాగిన గొల్లపాలెంలో సీఎం చంద్రబాబు కార్యక్రమం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం నిర్వహణలో కీలకమైన దాతలకు ప్రేరణ, పేదలకు భరోసానివ్వటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తగొల్లపాలెం కార్యక్రమం సఫలీకృతమైంది. గతంలో వలే భారీ ప్రసంగం లేకుండా నిర్దిష్ట విధానంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు కాస్తంత ఉల్లాసాన్ని మరికాస్త ఉద్వేగాన్ని కల్పించింది. గ్రామంలో పూర్తిగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వారి స్థితిగతులను వారి ద్వారానే బహిరంగపర్చి చేయూతనిచ్చే దాతలను ప్రేరణ చేస్తూ కార్యక్రమం నిర్వహించారు అదేసందర్భంలో నియోజకవర్గంలో పార్టీ, పాలనాపరమైన వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఏలూరి పాత్రకు కితాబిస్తూ ఎమ్మెల్యే చూసిన సమస్యల చిట్టా చదువుతూనే కొన్ని పనులకు నిర్దిష్టమైన హామీలు ఇస్తూ కొన్నింటిని దాటవేశారు. తొలుత సీఎం హోదాలో గ్రామస్థులతో మమేకమైన ఆయన చివర్లో పార్టీ అధ్యక్షుడి హోదాలో పార్టీశ్రేణులతో మమేకం కావటం విశేషం. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం పర్చూరు నియోజకవర్గంలోని కొత్తగొల్లపాలెంకు ఆయన వచ్చారు.

పీ-4 కార్యక్రమంపై అవగాహన

గతంలో వలే పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వాహణకే ఆయన పరిమితం కాకుండా కొత్తగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం తీరుతెన్నులను ప్రజలకు తెలిపే ప్రయత్నం చేశారు. గ్రామంలో 996 మంది ఉండగా అందులో 17మందికి మరుగుదొడ్లు, 13 మందికి గృహాలు, 30మందికి పింఛన్లు, ఒకరికి రేషన్‌కార్డు, నాలుగు గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. వారందరికీ ఆ సౌకర్యాలన్నీ కల్పించాలనీ అక్కడే ఉన్న కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆ తర్వాత గ్రామంలో బాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పది కుటుంబాలను అధికారులు గుర్తించగా వారిని వేదికపైకి పిలిచి మాట్లాడారు. అందులో వెంకాయమ్మ అనే మహిళ తనకు భర్త లేడని, పిల్లలిద్దరూ పెద్దవారైనా కూలీకి పోక తప్పటం లేదని చెబుతూ తనకు వచ్చిన క్యాన్సర్ వ్యాధితో పడుతున్న ఇబ్బందిని విడమర్చి చెప్పారు. అలాగే అంకమ్మ అనే మరో మహిళ భర్త విద్యుత్ షాక్‌తో చనిపోగా తన కుమారుడైన వెంకటేష్‌ను చదివించేందుకు పడుతున్న బాధలను వివరించారు. ఇలా ఐదారు కుటుంబాల వారిని పిలిచి వారితో మాట్లాడి పేదల సమస్యలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోండంటూ ప్రజానీకానికి వివరించారు. ఒక మహిళ 'నేను ఈరోజో రేపో రాలిపోతా కానీ నా అల్లుడు అర్థంతరంగా మరణించాడు. ఆ బాధతో నా కుమార్తె పక్షవాతానికి గురైంది. వారిద్దరి పిల్లలు చేయూత లేక తల్లడిల్లుతున్నారు. ఈ వయస్సులో కుటుంబాన్ని ఈదలేకపోతున్నానంటూ' చెప్పిన మాటలతో సీఎం చలించిపోయారు. ఇదే కుటుంబ అనుబంధం అంటూ ఆయన వారికి చెబుతూ మాట్లాడిన మహిళలు తమకోసం కాక పిల్లల కోసం చేస్తున్న అభ్యర్థనలు విని చేయూతనిచ్చే మార్గదర్శకులు(దాతలు) ముందుకు రావాలని కోరారు. అదే వేదిక మీద ముందుగా గుర్తించిన విక్రమ్ నారాయణ(గొనసపూడి), అలాగే ఇంకొల్లు మండలం గొల్లపాలెంకు చెందిన ఆంజనేయులు అనే పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి పీ-4 కార్యక్రమంలో మార్గదర్శి-బంగారు కుటుంబం అనేది మా నినాదం అంటూ వారికి వివరించారు. పారిశ్రామికంగా వారు ఎదిగిన విధానాన్ని స్వగ్రామాల్లో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకుని, ఈ పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని బహిరంగంగా కోరారు. అప్పటికే పేదల మాటలతో చలించిపోయిన ఆ వ్యాపారవేత్తలు ఇద్దరు సీఎం ఇచ్చిన స్ఫూర్తితో ఆ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు హామీ ఇచ్చారు. తలా 15 కుటుంబాలను ఆర్థికంగా ఉన్నత స్థాయిలోకి తెచ్చే విధంగా వారు చేయాలని సూచిస్తూ తదనుగుణంగా ఆ పారిశ్రామికవేత్తలకు సేవాపుష్తకాలతో సన్మానిస్తానని ప్రకటించారు. ఒక మహిళ కుమారుడైన గణేష్‌ను చదివించే బాధ్యత విక్రమ్‌నారాయణకు అప్పగిస్తూ, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ చికిత్సకు ప్రభుత్వపరంగా పూర్తి ఆర్థిక సహాయం ఇవ్వాలని కలెక్టర్‌కు అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇప్పటికే ఆ గ్రామంలోని పలువురు పేదలకు తన ట్రస్టు ద్వారా ఇస్తున్న చేయూతను, వైద్య చికిత్సను ప్రస్తావిస్తూ కొనియాడారు.

పోర్టు కోసం కేంద్రంతో మాట్లాడతా

అదే కార్యక్రమంలో చివర్లో ఎమ్మెల్యే ఏలూరి అందించిన సమస్యల చిట్టాలోని ప్రధాన అంశాలను ప్రస్తావించారు. మోటుపల్లి వద్ద పోర్టు నిర్మాణానికి సాంకేతిక అనుమతులు లభిస్తే కేంద్రంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. అలాగే అనుబంధ పరిశ్రమలను తీసుకొస్తానని ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే ఇచ్చిన సమస్యల చిట్టాను చదువుతూ నాలుగు కొత్త ఎత్తిపోతలకు, 32 పాత ఎత్తిపోతల పథకాల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. సాగర్ కాలువ ఆధునికీకరణతోపాటు కేడబ్ల్యూడీ ఆయకట్టు పరిధిలో ఆయకట్టు అభివృద్ధి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.5 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. రోడ్లు, వంతెనలు ఇతరత్రా అనేక సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుంటూరు చానల్ పొడిగింపు విషయంలో ఇప్పటికే సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.


ప్రజావేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే ఏలూరి

అగ్రస్థానంలో పర్చూరు

పాలనే కాక రాజకీయ వ్యవహారాలు, పార్టీపరమైన వ్యవహారాల్లో కూడా పర్చూరు నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు కొనియాడారు. హెలిప్యాడ్‌కు సమీపంలో ఏర్పాటుచేసిన వేదిక వద్ద నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన భేటీ అయ్యారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సత్యప్రసాద్, ఇన్‌చార్జి మంత్రి పార్థసారధి, బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్ కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 15మంది పార్టీ నాయకులను పేరుపేరున ప్రస్తావిస్తూ సీఎం అభినందించారు. వరుసగా మూడుసార్లు టీడీపీ గెలుపునకు కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే ఏలూరి చరిత్ర తిరగరాశాడని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఒక కార్యక్రమంలో కలిసిన ఏలూరి తన అభిమాని అని, అందుకే పనితీరులో తనను అనుసరిస్తూ అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. పార్టీ నిర్మాణ వ్యవహారాల్లో రాష్ట్రంలో తొలి మూడు స్థానాల్లో నియోజకవర్గం ఉందన్నారు. వ్యక్తిగతంగా ఏలూరికి 100కు 88 పైబడి మార్కులు తెచ్చుకున్నారన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో తోడ్పడతానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

పేరుకున్న చెత్తా చెదారం

● అధ్వానస్థితిలో అంతర్గత రహదారులు

● 21వ వార్డులో ప్రజల ఇక్కట్లు

చీరాల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో చెత్తా చెదారం పేరుకు పోయింది. కొన్ని ప్రాంతాల్లో నెలలు గడుస్తున్నా మునిసిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా 21వ వార్డు బొమ్మల తోట, మేడా వారి వీధుల్లో అంతర్గత రహదారులు శిథిల దశకు చేరి రాత్రిళ్ల ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. అలాగే ఆయా రహదారుల వెంబడి వ్యర్థాలు దారుణంగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ సైతం పెద్ద ఎత్తున కుప్పలుగా ఉన్నాయి. ఈక్రమంలో రహదారుల్లో సంచరిస్తున్న మూగ జీవాలు ఈ వ్యర్థాల్లో ఆహారం కోసం తిరుగాడుతూ ప్లాస్టిక్‌ను తిని మృత్యువాత పడుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త సేకరణ చేసి మూగ జీవాల ప్రాణాలు రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం (ఇన్‌సెట్లో) శిథిలమైన డ్రైయిన్

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమ గ్ర విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ధర్నా, చర్చి సెంటరులో మానవహారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రఘురాం, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం ప్రదానం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీఅభయ కళారాధన సాంస్కృతి క సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు ఎల్‌సీఈఎస్ కళానిలయం సంస్థ జాతీయ ఉగాది పురస్కారం, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పురస్కారాలను అందజేశారు. మంగళవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టర్ కొలకలూరి రవిబాబు, నర్సింగోలు శ్రీని వాసప్రసాద్, మౌర్య, పలువురు వేదపండితులు ఈ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఆనవాయితీగా చలువ పందిళ్ల ఏర్పాటు

అద్దంకిలో తరతరాలుగా కొనసాగిస్తున్న వ్యాపారులు

శ్రీరామ నవమి రోజు కల్యాణోత్సవం

3 నెలల పాటు కొనసాగింపు

కొనుగోలుదారులు, ప్రజలకు ఉపశమనం

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో తరతరాలుగా చలువ పందిళ్ల ఏర్పాటు ఆనవాయితీని వ్యాపారులు కొనసాగిస్తున్నారు. ఉగాది నుంచి చలువ పందిళ్ల వేయటం ప్రారంభించి శ్రీరామనవమి నాటికి పూర్తి చేస్తారు. చలువ పందిళ్ల కింద శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణం పూర్తయిన తరువాత నుంచి ఎండల తీవ్రత తగ్గే వరకు సుమారు 3 నెలల పాటు చలువ పందిళ్లను అలానే ఉంచుతారు. ఈ నేపథ్యంలో అద్దంకి పట్టణంలో ఇప్పటికే రామాటాకీస్ బజార్‌లో మూడు చలువ పందిళ్ళు, పాత గాంధీబొమ్మసెంటర్ లో తాటాకుతో ఒక చలువ పందిరి ఏర్పాటు చేశారు. అత్తులూరివారి వీధి, గానుగపాలెం తదితర ప్రాంతాలలోని రామాలయాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు చేయనున్నారు. రామాటాకీస్ బజార్, పాత గాంధీ బొమ్మసెంటర్ లలో అత్యధిక శాతం వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చలువ పందిళ్లతో స్వామి కార్యం, స్వకార్యం నెరవేరుతుంది. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం చలువ పందిళ్ల కింద నిర్వహిస్తారు. అనంతరం మరో మూడు నెలల పాటు ఆ చలువ పందిళ్లను అలానే ఉంచుతారు. దీంతో ఎండా కాలంలో వేడిమి తీవ్రత తగ్గేందుకు దోహదపడుతుంది.


అద్దంకి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రామాటాకీస్ బజార్‌లో వేసిన చలువ పందిళ్లు


అద్దంకి లోని పాత గాంధీబొమ్మ సెంటర్‌లో వేసిన చలువ పందిరి

తాతల కాలం నుంచే ఏర్పాటు



నా చిన్నతనం నుంచి పాత గాంధీ బొమ్మ సెంటర్‌లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మా తాతల నుంచే చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండే వారని చెబుతారు. గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు అవసరమైన సరుకులు కొనుగోలు చేసుకొని ప్రశాంతంగా సేద తీరే వారు.

-మారం కోటేశ్వరరావు, రిటైర్డ్ హిందీ పండిట్, మారం వారి వీధి, అద్దంకి

ఆనవాయితీని కొనసాగిస్తున్నాం



తర తరాలుగా వస్తున్న ఆనవాయితీని మేము కూడా కొనసాగిస్తున్నాము. వ్యాపారులందరం తలా కొంత చందాలు వేసుకొని చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నాం. ఎండలో వచ్చిన పలువురు చలువ పందిరి కింద కొద్ది సేపు ఆగి సేద తీరుతుంటారు. ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంది.

-చిన్ని ప్రసాద్, పాత గాంధీబొమ్మసెంటర్,అద్దంకి

మూడు నెలల పాటు ఉంచుతాం



రామాటాకీస్ బజార్‌లో చలువ పందిళ్లను 25 సంవత్సరాల నుంచి ఏర్పాటు చేస్తున్నాము. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం చలువపందిరి కింద చేస్తాం. అనంతరం మూడు నెలల పాటు అలానే ఉంచుతాం. బాగా వర్షాలు పడి ఎండ తీవ్రత తగ్గిన తరువాత తొలగిస్తాం.

-నాగసూరి రమేష్, రామాటాకీస్ బజార్, అద్దంకి

అభివృద్ధి పనులపై జీఎస్టీ పిడుగు

● గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాల సేకరణ ● త్వరలో నోటీసులు పంపనున్న కమర్షియల్ టాక్స్ అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలంలో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేసినవారిపై జీఎస్టీ పిడుగు పడనుంది. గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాలను తమకు అందజేయాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ఎంపీడీవోకు అధికారికంగా లెటర్ ఇవ్వటంతో పాటు ఒక అధికారి ప్రత్యేకంగా మండల కార్యాలయానికి విచ్చేసి వివరాలను త్వరగా అందజేయాలని కోరటం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న వర్క్‌లు చేసిన వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. గత మూడేళ్లలో కూటమి ప్రభుత్వం రాకముందు వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 22కోట్ల వివిధ రకాల పనులను గ్రామాలలో నిర్వహించారు. మండలపరిషత్ పగ్గాలు వైసీపీ చేతిలో ఉండటంతో పనులన్నీ ఆ పార్టీ నాయకులే నిర్వహించారు. అయితే పనులు నిర్వహించిన వారిలో జీఎస్టీ నంబర్ కల్గిన వారికి పెద్దగా ఇబ్బంది లేదు. వారు ఎప్పటికపుడు జీఎస్టీ వివరాలను వాణిజ్య పన్నులశాఖకు అప్‌డేట్ చేస్తుంటారు. కానీ ఎక్కువ మంది జీఎస్టీ ఖాతాలు లేనివారే నామినేషన్ పద్ధతిలో గ్రామాల్లో పనులు నిర్వహించారు. ఇపుడు వారందరూ నోటీసులు అందుకోనున్నారు. 18శాతం చొప్పున దీనికి అదనంగా వడ్డీతో సహా జీఎస్టీ రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.5లక్షలు వర్క్ చేస్తే దాదాపు రూ.90వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఎపుడో చేసిన పనులకు ఇపుడు అదనంగా డబ్బులు చెల్లించాల్సి రావటం పట్ల పనులు చేసినవారికి పాలుపోవటం లేదు. నోటీసులు అందితే దాని ని బట్టి ఏమి చేయాలో డిసైడ్ అవుదాములే అని వైసీపీ అధిష్ఠానం తమ నాయకులను ఊరడిస్తుంది. కాగా దీని ఎఫెక్ట్ కొత్తగా నిర్వహించబోయే పనులపై కూడా పడుతుంది. మండల నిధులతో పనులు నిర్వహించటానికి పనుల వివరాలు అందచేస్తే వర్క్ ఆర్డర్స్ ఇస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నా గ్రామాల్లో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముందుకురావటానికి జంకుతున్నారు. 18శాతం జీఎస్టీ చెల్లిస్తే తమకు మిగిలేదేముంది అని వెనుకాడుతున్నారు. దీంతో మండల ఖాతాలో ఉన్న రూ.21కోట్లతో అభివృద్ధి పనులు నిర్వ హించడానికి ఇరువర్గాల మధ్య సఖ్యత కుదిరి నా జీఎస్టీ వ్యవహారంతో ముందుకు సాగటం లేదు.



నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో రాష్ట్ర కమిటి పిలుపు మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ చైర్మన్ కె.ఎర్రయ్య, సెక్రటరీ జనరల్ రఫీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ పీఆర్సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, 20శాతం ఐఆర్ ప్రక టించాలని, మిగిలిన ఆర్థిక బకాయిలు, జడ్పీ పీఎఫ్ లోన్లు, సరెండర్‌లీవ్ బ కాయిలు విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పంచాయతీలకు భారం కానున్న ట్రాక్టర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీల కు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లు ఆర్థికభారం కానున్నాయని సర్పం చ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రక టనలో ఆరోపించారు. ప్రభుత్వ చర్య మంచిదే అయినప్పటికీ పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటికే చెత్త రిక్షాలు మరమ్మ తులకు గురైతే నిధులు లేక అవి మూలన పడేస్తున్న విషయాన్ని గుర్తుచేశా రు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేని స్థితిలో పంచాయతీలు ఉంటే ట్రా క్టర్ డ్రైవర్ జీతం, డీజల్‌లాంటి ఖర్చులను భరించే పరిస్థితి లేదన్నారు.

అవీ..ఇవీ



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రావణి ప్రియదర్శిని

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

మేదరమెట్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రావణి ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మేదరమెట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికలు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తల్లిదండ్రులు నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, ప్రకాశ్, రమణయ్య, మహ్మద్ రఫీ, ఏఎస్ఐ అహ్మద్, హెచ్ఎం అంజయ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటైన స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు

పంగులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేశారు.పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికయిన కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో యూనిట్ ఏర్పాటుకు ఏపీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు 16 మంది బాలురు, 16 మంది బాలికలతో మంగళవారం యూనిట్లను ఏర్పాటు చేశారు. బాలుర స్కౌట్ బృందానికి స్టెల్లార్ స్కౌట్స్‌గా, బాలికల బృందానికి ఎలైట్ గైడ్స్‌గా నామకరణం చేశారు. బాలుర యూనిట్‌కు స్కౌట్ మాస్టర్‌గా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.వేణు, బాలికల యూనిట్ కెప్టెన్‌గా క్రాఫ్ట్ ఉపాధ్యాయిని ఎస్.అనూరాధ వ్యవహరిస్తారని ఆ పాఠశాల హెచ్ఎం అనిత తెలిపారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

ప్రాంగణ ఎంపికలో 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

చీరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : క్యాడ్‌సీస్ ఇండియా లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణం ఎంపికలలో స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈసందర్భంగా మంగళవారం కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అభినందన సభ నిర్వహించారు. ఈనెల 12వ తేదీన వీరు ఉద్యోగాల్లో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, తదితర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

నేడు వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ

బల్లికురవ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదికి స్వయం సహాయక సంఘాల వార్షిక ప్రణాళిక తయారీపై బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ జరుగుతుందని వెలుగు ఏపీఎం రాజారావు తెలిపారు. మొదటి విడతగా పెద అంబడిపూడి, బల్లికురవ, కొప్పెరపాడు, కొణిదెన క్లస్టర్లలోని ఎన్యూమరేటర్స్‌కు శిక్షణ ఉంటుందని ఏపీఎం తెలిపారు.

మచ్చలేని నాయకుడు.. నిరంతర శ్రామికుడు

ప్రజావేదికలో ఎమ్మెల్యే ఏలూరికి సీఎం కితాబు
మీ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి హామీ
వెంటనే కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు



ప్రజా వేదికలో ఎమ్మెల్యే ఏలూరిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

పర్చూరు(చీరాల), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మీ ఎమ్మెల్యే ఏలూరి మచ్చలేని నాయకుడు. సొంతంగా వ్యాపారం చేసుకుంటూ ప్రజాసేవలో ఉత్సాహంగా ఉంటున్నారు. ఎక్కడా వివాదాలకు తావివ్వకుండా తనదైన శైలిలో అభివృద్ధికి పాటుపడుతున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం మొక్కలు నాటే కార్యక్రమంలో నేను నాటిన మొక్కలకు నీరు అందించేందుకు వచ్చి నాకు దగ్గరయ్యాడు. ఈక్రమంలోనే వరుసగా ఇది మూడోసారో లేక నాలుగోసారో ఎమ్మెల్యేగా పని చేస్తున్నారు. అంటూ సీఎం నారా చంద్రబాబునాయుడు నవ్వుతూ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురించి మంగళవారం చిన గంజాం మండలం పెద గంజాం ఆవులదొడ్డి కొత్త గొల్ల పాలెంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడారు. దీంతో ఆ ప్రాంగణమంతా జై సాంబన్న, జై చంద్రన్న అంటూ నినాదాలతో మార్మోగింది. అనంతరం సీఎం మాట్లాడుతూ మీ ఎమ్మెల్యే ఊరికే కార్యక్రమాలు నిర్వహించరు. నా వద్ద ఇప్పటికే నియోజకవర్గానికి చేయాల్సిన పనులకు సంబంధించిన అంశాలను కట్టలు, కట్టలు పేర్చి నాముందు ఉంచారు. అంటూ సీఎం మాట్లాడిన మాటలు ఆసక్తికరంగా మా రాయి. ఈక్రమంలో చూస్తుంటే పక్కా ప్రణాళికతోనే ఏలూరి గ్రామ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు అర్థమవుతోంది. అయితే అందుకు సీఎం కూడా సానుకూలంగానే సమస్యలపై స్పందించారు. కొత్త గొల్ల పాలెం మాత్రం దాదాపుగా నలభై సంవత్సరాలుగా టీడీపీకి కంచుకోటగా ఉండి పార్టీకి అండగా, ఏలూరికి తోడుగా ఉంటున్నట్లు సీఎం చెప్పారు. ఈక్రమంలో గ్రామ ప్రజల రుణం తీర్చుకునే సమయం వచ్చినట్లు చెప్పారు. ఈక్రమంలోనే కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోకి రాగానే మరుగుదొడ్లు 17, పింఛన్‌లు 30, హౌసింగ్ 13, విద్యుత్ మీటర్‌లు 4, రేషన్ కార్డుల సమస్యలు నాదృష్టికి వచ్చినట్లు సీఎం చెప్పారు. వాటన్నింటిని వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ వెంకట మురళీకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో హర్ష ధ్వానాలతో ప్రాంగణం మారుమోగింది.

వీధి దీపాలు కచ్చితంగా వెలగాలి. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం ఏర్పాటు చేసేలా సూచనలు చేశారు. త్వరలోనే చినగంజాంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. మైనార్టీల కోసం ఈద్గాలు, ఎస్సీ ఎస్టీ, బీసీలకు కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని కులాలకు బరియల్ గ్రౌండ్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వలపర్ల ఇండస్ట్రియల్ పార్క్‌ను ఆధునీకీకరణ విధానంలోకి తెస్తామని వివరించారు. గుంటూరు చానల్‌ను ఆధునీకరించనున్నట్లు చెప్పారు. రైతులు ఐక్యమత్యంతో మెలిగితే మేనేజ్‌మెంట్ విధానంతో అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి మరమ్మతులకు గురి కాకుండా చూస్తామన్నారు. రైతులు ఐక్యంగా ఉంటే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సమస్యలు దరిచేరవని సూచించారు. అయితే ప్రస్తావించిన అంశాలన్నీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకువెళ్లగా సీఎం సానుకూలంగా స్పందించారు.



సీఎం చంద్రబాబును ఆప్యాయంగా పలుకరిస్తూ కరచాలనం అందిస్తున్న గ్రామస్థులు

మండుటెండలో సీఎం కోసం నిరీక్షణ

- కరచాలనంకు పోటీపడిన గ్రామస్థులు

పర్చూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలం పెద్దగంజాం ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును చూసేందుకు గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా సీఎం కోసం నిరీక్షించారు. తనకోసం వచ్చిన ప్రజలను సీఎం ఆప్యాయంగా పలుకరించారు. ఆ సందర్భంలో ముఖ్యమంత్రికి కరచాలనం ఇచ్చేందుకు పోటీపడ్డారు.

సీఎం వెంట ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొండయ్య మంగళవారం పర్చూరు నియోజకవర్గంలో జరిగిన పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అడుగడుగునా సీఎం వెంట ఉంటూ ఆయా కార్యక్రమాలకు సంబంధించిన పనుల్లో మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో మమేకమయ్యారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో పాత్రులయ్యారు. ఎమ్మెల్యేతో పాటుగా చీరాల నుంచి ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం వాహనం ముందు కాలినడకన వెళుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన

చినగంజాం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన పోలీసు అధికారులను, సిబ్బందిని గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, బాపట్ల ఎస్పీలు అభినందించారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి మంగళవారం పేదల సేవ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం పర్యటన నిమిత్తం సౌత్ జోన్ ఐజీ, జిల్లా ఎస్పీలు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ఆధారంగా పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పోలీసులను అప్రమత్తం చేశారు.

ఎటువంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియటంతో సిబ్బందిని బాపట్ల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



సీఎం పర్యటన బందోబస్తులో పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పింఛన్ల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం వృద్ధులు, దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటవ తేదీన క్రమం తప్పకుండా సామాజిక పింఛన్లు ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే పనిలో ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలనుంచిఅర్జీలనుస్వీకరించారు.గ్రామంలో సామాజిక భవనాలు, డ్రైనేజ్ నిర్మాణాలకు హామీ ఇచ్చారు. జాతీయ రహదారి పక్కన విద్యుత్ లైన్ ఆధునీకీకరణ చేపట్టాలన్నారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న చింతల చెరువు ముక్కంటి ఇంటి నిర్మాణం కోసం అవసరమైన సిమెంట్, ఇనుము వెంటనే సమకూర్చాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. మాటలు సరిగారాక, మానసిక, శారీరక అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన చింతలచెరువు శాంతికుమారికి అర్హతగల పింఛన్ అందేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ మస్తానరావు, ఏఈ అనిల్, హనుమంతరావు, ఈవోఆర్డీ సుమంత్, స్థానిక నేతలు నార్నె సుబ్బారావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్,కేవీ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



భగవాన్‌రాజుపాలెం గ్రామంలో వృద్ధురాలికి సామాజిక పింఛన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

రోడ్డుపై మురుగును చూసి మంత్రి ఆగ్రహం

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భగవాన్‌రాజుపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో నివాస గృహాల ముందు సీసీరోడ్డుపై మురుగు పేరుకుని ఉండటంపై మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజ్ నిర్మాణం చేపట్టి మురుగు నీరు రోడ్డుపై నిల్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. హైవే అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.



అద్దంకి పట్టణంలోని 12 వ వార్డులో పింఛన్ డబ్బులు సచివాలయ సిబ్బంది తో కలిసి పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అత్తులూరి రమేష్

మొదటి రోజు 93 శాతం పింఛన్ల పంపిణీ

బల్లికురవ: మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో మంగళవారం 93 శాతం పింఛన్లను పంపిణీ చేశామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. బుధవారం కూడా పంపిణీ జరుగుతుందని, మిగిలి పోయిన వారు వెంటనే తీసుకోవాలని ఎంపీడీవో కోరారు. కూకట్లపల్లి గ్రామంలో టీడీపీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహం తదితరులు పింఛన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు.

పేద కుటుంబాలకు ఆసరాగా పింఛన్

అద్దంకి : ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ నగదు పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని 12 వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ బాబు అన్నారు. మంగళవారం 12 వ వార్డు పరిధిలో పింఛన్‌ల పంపిణీని స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయన పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.

వితంతు పింఛన్ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముప్పవరంలో భర్తను కోల్పోయిన మహిళలకు మంజూరైన వితంతు పింఛన్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ముప్పవరం గ్రామానికి చెందిన నందిపాటి మల్లేశ్వరి, తోట నాగేంద్రంలకు జనవరి నుంచి వితంతు పింఛన్ మంజూరైంది. ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన మూడు నెలల పింఛన్ మొత్తాన్ని ఒక్కొక్కరికి రూ. 12 వేల వంతున స్థానిక టీడీపీ నేత కుక్కపల్లి ఏడుకొండలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి మండలంలో

అద్దంకిటౌన్ : మండలంలోని అన్ని గ్రామాలల్లో సచివాలయ సిబ్బంది మొదటి రోజు పెన్షన్‌ల పంపిణీ వేగవంతంగా చేసినట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య మంగళవారం ఒ క ప్రకటనలో తెలిపారు. 95.25 శాతం పెన్షన్‌ల పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

తీరంలో అలల తాకిడికి యువకుడి మృతి

- మరొకరిని రక్షించిన పోలీసులు

రామాపురం(చీరాల), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రామాపురం సముద్రతీరంలో యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈఘటన మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం పర్చూరు నెహ్రూనగర్‌కు చెందిన చుక్కా వంశీ(23) మిత్రులు సుమారు 40 మందితో కలిసి రామాపురం సముద్రతీరానికి వచ్చారు. ఈక్రమంలో ఎక్కువ సమయమే తీరంలో గడిపారు. ఈక్రమంలో వంశీ, రాజేష్ గల్లంతవుతుండగా, మెరైన్ వేటపాలెం పోలీసులు రాజేష్‌ను రక్షించి ఒడ్డుకు చేర్చారు. అయితే వంశీ మాత్రమే గల్లంతయి, కొద్ది సమయానికే మృతదేహం ఒడ్డుకు చేరింది. ఈక్రమంలో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతిచెందిన వంశీ

స్కూటీ ఢీ కొని మహిళకు తీవ్ర గాయాలు

- స్పందించి వెంటనే 108లో పంపిన సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రోడ్డు మార్జిన్‌లో నడిచి వెళ్తున్న మహిళను స్కూటీ ఢీ కొనటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు మంగళవారం రాత్రి పద్మ అనే మహిళ స్నేహితురాలుతో కలిసి అద్దంకి పట్టణంలో నుంచి రామ్ నగర్ వైపు నడిచి వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన స్కూటీవాలా ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు గుమి కూడారు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న సీఐ సుబ్బరాజు ఆగారు. అప్పటికే 108 వాహనం రావటంతో అందులో ఎక్కించి వెళ్లారు. క్షతగాత్రురాలిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేట్ అంబులెన్స్‌లో ఒంగోలు తీసుకువెళ్లారు.



స్కూటీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మహిళ

రేపు మార్టూరు రామాలయంలో కలశప్రతిష్ఠ

మార్టూరు,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మార్టూరు ఈశాన్య రామాలయంలో కలశ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గత కొన్నేళ్లుగా రామాలయంలో పూజాదికాలు జరగకపోవడంతో కొంతమంది భక్తులు మరల రామాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని,దేవాలయంలో నిత్య పూజలు జరిగేవిధంగా ఉండాలని కోరుకుంటూ ఆలయ పునర్నిర్మాణపనులు చేపట్టారు. 1944లో నిర్మించిన రామాలయంలో కొంతకాలంగా పూజలు నిలిచిపోయాయి. దాంతో కొంతమంది భక్తులు ఆర్థిక సహకారంతో గుడి పునర్నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. గుడికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు.గతంలో గుడి పైభాగాన ఉన్న కలశాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకెళ్లారు. ప్రస్తుతం భక్తులు కొత్తగా కలశాన్ని తయారుచేయించారు.గురువారం కలశ ప్రతిష్ఠ జరగనుంది. అంతేగాకుండా దాత రాయుడు రామాంజనేయులు రామాలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ఏర్పాటుకు సహకరించారు. ఈ సందర్భంగా మంగళవారం రామాలయం వద్ద గణపతిపూజ, ప్రధానహోమాలు,అగ్నిప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 11 వతేదీన శుక్రవారం ఒంటిమిట్ట రామాలయంలో కల్యాణం జరిగేరోజున ఈ రామాలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని వారు తెలిపారు.



పునర్నిర్మాణం చేసిన మార్టూరులోని ఈశాన్య రామాలయం (ఇన్‌సెట్లో) సీతారామలక్ష్మణుడి ఉత్సవ విగ్రహాలు

ముగిసిన 'పది' పరీక్షలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభం అయిన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. అద్దంకిలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో, తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్, కాకానిపాలెం జడ్పీహెచ్ఎస్, శ్రీ చైతన్య పరీక్ష కేంద్రాలను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, ఆర్ఐవో ఎస్‌కె బాషా, ఎంఈవో-2 బూదాటి సుధాకరరావులతో కలిసి సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు. ఈ 5 పరీక్ష కేంద్రాలల్లో మొత్తం 1,009 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరు కాగా 1,005 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో బూదాటి సుధాకరరావు తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సందడి చేశారు.



పరీక్షరాసి బయటకు వస్తున్న విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పంగులూరులో బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని,వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

'డైట్'లో అధ్యాపక పోస్టుల భర్తీ

నెల్లూరు (విద్య) : జిల్లాలోని పల్లిపాడు డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎ.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఈనెల 10వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 11 నుంచి 13వతేదీ వరకు దరఖఖాస్తులను పరిశీలించి అర్హులకు 16, 17వ తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 19న ఇంటర్వ్యూలు, 21న డిప్యుటేషన్ నియామక ఉత్తర్వులు అందచేస్తామన్నారు. 22వతేదీన ఆయా సిబ్బంది విధుల్లో చేరా లని, ఏదైనా సందేహాలు ఉంటే విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రక్తం పీల్చి.. పైసలు గుంజి!

ప్రైవేటు ల్యాబొరేటరీలలో ఇష్టానుసారం వసూలు • నిర్వాహకులు, వైద్యుల మిలాఖత్

కార్పొరేట్ ఆసుపత్రులలో మరింత దోపిడీ • జిల్లాలో ప్రతినెలా రూ.8.5 కోట్ల వ్యాపారం



విడవలూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యానికి తరచూ జలుబు చేస్తుండటంతో నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యుడ్ని కలిశారు. లివర్‌కు సంబంధించి సిరప్ పరీక్ష చేయించుకోమని ఆ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌కు సిఫారసు చేశారు. పరీక్ష అనంతరం ఏ సమస్య లేదని తేలింది. అయితే, నిర్ధారణ పరీక్షకు మాత్రం రూ.3వేలు ఖర్చు అయ్యింది.

నెల్లూరులోని బాలాజీనగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేణు దగ్గు, జ్వరంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. రక్తంలో ప్లేట్‌లేట్‌ల కౌంట్, మలేరియా పరీక్షలు చేయించుకోవాలని సదరు వైద్యుడు రాయడంతో రూ.2వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. తీరా సాధారణ జ్వరంగా నిర్ధారణ అయింది. ఇలా అవసరం లేకపోయినా రక్త పరీక్షల పేరుతో కొందరు వైద్యులు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు.

జ్వరం వస్తే రక్తపరీక్షలు.. కడుపునొప్పి వస్తే మలం పరీక్షలు.. దగ్గు వస్తోందంటే ఉమ్మి పరీక్ష, ఎక్సరే.... ఆయాసం అంటే ఈసీజీ స్కానింగ్.. తలనొప్పిగా ఉందంటే సిటీ స్కాన్.. పొట్ట ఉబ్బరంగా ఉందంటే ఎండోస్కోపీ.... ఇలా పరీక్షలు లేనిదే వైద్యులు రోగ నిర్ధారణ చేసే పరిస్థితి లేదు. రోగి నాడీ చూసి రోగం ఏమిటో ఇట్టే చెప్పే వైద్యులు ఉన్నా ల్యాబ్‌లో పరీక్షలు, రిపోర్టులను పరిశీలించనిదే చికిత్సను అందించడంలేదు. వైద్యులకు అందించే ఫీజుల కన్నా భారీ మొత్తంలో ఈ ల్యాబ్ పరీక్షలకు ఖర్చు అవుతోంది. ఇందులోనూ వైద్యులు భారీ మొత్తాలను ఆశిస్తుండటంతో ఆయా ల్యాబ్ నిర్వాహకులు కూడా వైద్యులతో ఒప్పందాలు కుదుర్చుకుని రోగుల రక్తాన్నే కాదు.. నగదునూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా 600లకుపైగా రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు ఉన్నాయి. ఇందులో 100 వరకు కార్పొరేట్ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నాయి. వీటిలో ఒక్కో ల్యాబ్‌లో వివిధ రకాల పరీక్షల పేరుతో రోజూ రూ.20వేల నుంచి 30 వేల వరకు వసూలు చేస్తుంటారు. 300 ల్యాబ్‌లలో ఒక్కో ల్యాబ్‌లో రోజుకు రూ.4-5 వేల వరకు పరీక్షల పేరిట వసూలవుతాయి. మరో 200 ల్యాబ్‌లలో రోజుకు 500 నుంచి వెయ్యి రూపాయలు రక్త పరీక్షలు పేరిట వసూలు చేస్తారు. ఈ లెక్కన ప్రతి నెల 8.50 కోట్ల రూపాయలకు పైగా రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే 300లకు పైగా రక్తపరీక్షా కేంద్రాలు ఉండగా, వీటిలో 80 శాతం ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్నవే. వివిధ పరీక్షల పేరుతో వైద్యులకు పర్సంటేజీల రూపంలో అందే మొత్తం భారీగానే ఉంటోంది. అవసరం లేకపోయినా హిమోగ్లోబిన్ పరీక్ష, కొలస్ట్రాల్, షుగర్, కిడ్నీకు సంబంధించి బ్లడ్ యూరియాతోపాటు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. చేసేది లేక రోగులు కూడా ఆ పరీక్షలు చేయించుకుంటున్నారు. మరోవైపు ల్యాబ్‌లలో టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేసిన వారే రక్తపరీక్షలు చేయాలి. ఇందులో అనుభవం ఉన్న వారు పెద్దస్థాయి పరీక్షలు చేయాలి. అయితే ఎటువంటి కోర్సు చేయని వారు కూడా కొంత అనుభవంతో పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల ఫలితాలలో అనేక పొరపాట్లు నమోదవుతున్నాయి. ఈ రిపోర్టుల ఫలితాలతో వైద్యులు చికిత్స చేస్తుండటంతో మరో వ్యాధికి గురి కావాల్సి వస్తోంది.

ల్యాబ్‌లలో వసూలు చేస్తున్నది.. (రూ.లలో)

నిర్ధారణ పరీక్ష	చేయాల్సినది	చేస్తున్నది
హిమోగ్లోబిన్	45-100	200-300
హెచ్ఐవీ	100-150	250-300
హెచ్‌బీఎస్	50-75	150-250
యూరియా	45-80	150-200
షుగర్	50-75	250-300
సిరం క్రియేటిన్	40-70	200-250
పాస్పేట్	75-100	300-470
యూరిన్	50-75	150-230
డెంగ్యూ	250-300	800-2600
ప్లేట్లెట్	150-200	500-700
మలేరియా	100-150	300-350

• కొన్నింటికే అనుమతులు..

జిల్లావ్యాప్తంగా 600లకుపైగా కేంద్రాలు ఉండగా, కేవలం 100కుపైగా మాత్రమే అనుమతులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడిస్తోంది. నెల్లూరుతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరులలో కొత్తగా ఈ కేంద్రాలు పుట్టుకొస్తున్నా వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు నగదు వసూలు చేస్తున్నారు. గుర్తు వచ్చినప్పుడు మాత్రమే వైద్య ఆరోగ్య శాఖాధికారులు దాడులు నిర్వహించి హెచ్చరికలతో వదిలేస్తుండటంతో పరిస్థితి యథావిధిగా మారుతోంది.

నిబంధనలు ఇలా..

రక్తపరీక్షా కేంద్రాలు ఏర్పాటుకు తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు పొందాలి. ఆయా కేంద్రాలలో ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తారో రాతపూర్వకంగా తెలియజేయాలి. అలాగే ఏఏ పరీక్షలు నిర్వహిస్తున్నారో కూడా బోర్డులు ఏర్పాటు చేయాలి. ఏఏ పరీక్షలకు ఎంత నగదు వసూలు చేస్తారో తెలియజేయాలి. పారామెడికల్ శిక్షణ పూర్తి చేసుకున్న వారు మాత్రమే నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది. ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకోవాలి.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

రక్తపరీక్షా కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలా చేసుకోని వారిపై తీవ్ర చర్యలు ఉంటాయి. ఎప్పటికప్పుడు మా అధికార బృందాలు కేంద్రాలపై దాడులు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నాయి. కేసులూ నమోదు చేస్తున్నాము. అనుమతులు ఉన్న వారే ఈ కేంద్రాలు నిర్వహించాలి. లేదంటే చర్యలు తప్పవు. పరీక్షల పేరుతో అధిక ధరలు వసూలు చేసే వాటిపై నిఘా పెడతాం.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



మనుబోలు : పరీక్షలు ముగియడంతో కేంద్రంలో నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థినులు

హమ్మయ్య..!

ముగిసిన టెన్త్ పరీక్షలు

ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలు మంగళవారం నాటితో పూర్తయ్యాయి. దీంతో విద్యార్థులంతా చివరి రోజున తమ పాఠశాలల్లో ఉపాధ్యాయు లకు, సహచర విద్యార్థులకు కన్నీటితో వీడ్కోలు పలికారు. మరికొంత మంది తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి ఐస్‌క్రీమ్ పార్లర్‌లకు వెళ్లి సేదతీరారు. ఈ ఏడాది జిల్లాలో 174 కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలు పరీక్షలను నిర్వహించారు. 1,968 మంది ఇన్విజి లేటర్లతోపాటు 174 మంది సీఎస్‌లు, 174 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 24 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు విధులు నిర్వహించారు. పరీక్షలన్నీ ప్రశాంతంగా పూర్తికావడంతో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

● 259 మంది గైర్హాజరు

మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు 259 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 29,310 మందికిగాను 29,051 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈఓ బాలాజీరావు 5 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది 59 కేంద్రాలను పరిశీలించారు. ఈ ఏడాది ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

● 3 నుంచి మూల్యాంకనం

పదోతరగతి పరీక్షలకు సంబంధించి ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎ.బాలాజీరావు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు అధికారులు చేపడుతున్నారని, సిబ్బంది నియామకాలను కూడా పూర్తి చేస్తున్నామన్నారు. ఈనెల 2వతేదీన సమావేశం నిర్వహించి సిబ్బందికి, ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తామన్నారు.

55 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లపై విచారణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్1, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 55 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లపై విచారణకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సురేష్ ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో ఏసీబీ బృందం కార్పొరేషన్‌లోని ఆరోగ్య విభాగంపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఇక్కడ అవినీతిపరమైన అంశాలను గుర్తించిన బృందం వాటి వివరాలను అప్పట్లో ప్రభుత్వానికి నివేదించింది. పలు డివిజన్లు, సెక్షన్లలో అవినీతి జరిగిందని గుర్తించిన ఏసీబీ వాటి ఆధారాలను అప్పట్లో ప్రభుత్వానికి సమర్పించింది. వాటిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరిని ఎవరు, ఎప్పుడు విచారిస్తారో తెలియాల్సి ఉంది.

నచ్చిన సమయంలో రిజిస్ట్రేషన్

● నేటి నుంచి కొత్త విధానం.. స్లాట్ బుకింగ్ అమలు

నెల్లూరు (హరనాధపురం), (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. తొలి విడతగా జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఒకే సారి అన్ని కార్యాలయాల్లో అమలు చేస్తే సమస్యలు వస్తాయన్న ఆలోచనతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ విజయవంతం అయ్యాక అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేసేలా ప్రణాళికలను రూపొందించారు. స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వచ్చాక స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండదు. నచ్చిన సమయంలో ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

● రోజుకు 78 మాత్రమే..

నెల్లూరులోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 78 స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఈ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ఒక సబ్ రిజిస్ట్రార్ ఉంటే 39 స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు మాత్రమే చేస్తారు. గంటకు ఆరుకు తగ్గకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్దేశించారు. డాక్యుమెంట్ రాసుకునేటప్పుడు ఏ సమయం కావాలో అందులో నమోదు చేసుకుంటే సరిపోతుంది. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి అవగాహన లేకపోతే మీసేవా కేంద్రాల్లో ఉండే సిబ్బందిని లేదా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అడిగి తెలుసుకోవచ్చు. ఈ విధానంపై ఇప్పటికే ప్రజలకు, వ్యాపారులకు, దస్తావేజు లేఖరులకు, ఆన్‌లైన్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాలను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నిర్వహించింది.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

రేషన్ షాపు వద్ద వివాదం

● ఇద్దరిని కత్తితో పొడిచిన వైసీపీ నేత ● కేసు నమోదు చేసిన కందుకూరు పోలీసులు

కందుకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు వద్ద ఏర్పడిన వివాదంలో వైసీపీ నాయకుడు ఇద్దరిని కత్తితో పొడిచిన సంఘటన మండలంలోని ఓగూరులో మంగళవారం రాత్రి జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. ఓగూరు ఎస్సీ కాలనీలో వైసీపీ నేతగా ఉన్న దగ్గుమాటి కోటయ్య రేషన్‌షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి ఎస్సీ కాలనీలో రేషన్ పంపిణీ చేసే సమయంలో కోటయ్య బియ్యం గురించి ప్రశ్నించిన ఓ మహిళపట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులైన పల్లె రవీంద్ర, పల్లె రవికిరణ్‌లు జోక్యం చేసుకోవటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కోటయ్య తన వద్ద ఉన్న కత్తితో వారిని పొడిచాడు. ఈ ఘర్షణలో కోటయ్యతోపాటు మెడబలిమి వెంకటేష్ కూడా పాల్గొన్నట్లు బాధితులు తెలిపారు. తీవ్ర గాయాలైన రవీంద్ర, రవికిరణ్‌లను స్థానికులు కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం బాధితుల బంధువులు కందుకూరులోని ఉప్పుచెరువులో ఉన్న దగ్గుమాటి కోటయ్య ఇంటిపై దాడిచేసి, వస్తువులు ధ్వంసం చేసినట్లు సమాచారం. కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీంద్ర, రవికిరణ్

ఇంటర్ తరగతుల ప్రారంభం

● జిల్లాకు చేరిన ద్వితీయ సంవత్సరం పుస్తకాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ (మంగళవారం) నుంచే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించింది. తొలివిడతగా ఏప్రిల్ 24వతేదీ వరకు తరగతులు నిర్వహించి 25 నుంచి తిరిగి జూన్ 1వతేదీ వరకు సెలవులు ఇవ్వనున్నారు. తిరిగి జూన్ 2న కళాశాలలు పునఃప్రారంభించి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం మార్చి 18న అకడమిక్ సంవత్సరాన్ని ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక సీనియర్ ఇంటర్‌కు సంబంధించి జిల్లాకు 1,19,724 నోట్‌పుస్తకాలు, 11,600 పాఠ్యపుస్తకాలు చేరగా వీటిని జిల్లాలోని అన్ని కళాశాలలకు మంగళవారం పంపిణీ చేశారు. అలాగే ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు 7వతేదీ నుంచి అడ్మిషన్లను ప్రారంభిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ ఏడాది నుంచే నీట్, జేఈఈ పరీక్షలకు సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేస్తూ కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు విధివిధానాలను ఇప్పటికే ఆయా కళాశాలలకు పంపించగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యాక నూతన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి తరగతులు తరగతులు ప్రారంభిస్తామని ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు.



ఇంటర్ కళాశాలలకు పాఠ్యపుస్తకాలను తరలిస్తున్న అధికారులు


వేసవిలో ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు!

● ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై అవగాహన కల్పించండి ● జిల్లా అధికార యంత్రాంగంతో కలెక్టర్

నెల్లూరు (హరనాధపురం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. వేసవి ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇస్తూ గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రులు, 108 వాహనాల్లో ఐస్‌ప్యాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు ఉంచాలని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయా ణికుల సౌకర్యార్థం చలివేంద్రాలు, బస్సుల్లో వాటర్ క్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేతిపంపులు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. ఎక్కడైనా పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కరెంటు కోతలు, షార్ట్‌సర్క్యూట్ లేకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మేతకు వెళ్తున్న పశువులకు నీటితొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డీఎంహెచ్‌వో సుజాత, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు సత్యవాణి, రమేష్‌నాయక్, ఆర్టీసీ ఆర్ఎం మురళీబాబు, విద్యుత్ శాఖ ఈఈ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బపై అవగాహనక కల్పిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	256
స్కిన్‌లెస్	282

కోడిగుడ్ల ధర (100): 520

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280

కలిగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 371 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 265 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-82, ఆర్ ఆర్-3, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-13 కారణాలతో 106 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.254, సగటు ధర రూ.274.89గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బోగోలు యాదవపాలెంలో వెలసి ఉన్న గంగమ్మకు నెల తొలి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని గంగపెట్టికు పూజలు నిర్వహించారు. చిన్నారులు ధన్విక, విశిష్ఠల భరతనాట్యం ఆకట్టుకుంది. ప్రతి ఆదివారం గంగమ్మకు పొంగళ్ల కార్యక్రమం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

● ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి సన్మానం

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ కూటమి ప్రభుత్వానికి రుణ పడి ఉంటామని బుడగజంగాల నేతలు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి నివాసం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు.



ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందచేసి అభినందిస్తున్న బుడగ జంగాలు

నా రాజకీయ ప్రవేశానికి నాన్నే ప్రేరణ

● ఎమ్మెల్సీ శ్రీకాంత్ ● ఘనంగా కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలు

కందుకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నా రాజకీయ ప్రవేశానికి నాన్నే ప్రేరణ అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఆయన తండ్రి, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఎప్పుడూ సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో ముందుకు సాగేవారని, ఆయన చూపిన మార్గంలో నేను నడవాలని ఎల్లప్పుడూ ప్రోత్సహించేవారని తెలిపారు. అనంతరం రామయ్య బాల్య స్నేహితులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, గజమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజవాడ వెంకటరావు, డాక్టరు ఆదిలాభాను, కంచర్ల సుబ్బారావు, గట్టినేని అయ్యన్న, కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రామయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వివిధ రంగాల ప్రముఖులు, అధ్యాపకులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలి

బిట్రగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరగాలని క్రైస్తవ సంఘాల సభ్యులు, పాస్టర్లు కోరుతూ మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బోగోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ శ్యాంసన్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని అని క్రైస్తవ సంఘాల పాస్టర్లు, సభ్యులు విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట పెట్రోల్ బంక్ నుంచి బోగోలు బజారు కూడలి మీదుగా రైల్వే ఎల్సీగేట్ 144 వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ కమిటీ సభ్యులు సీహెచ్.నాగరాజు, చిల్లా రవి, జీ.రమేష్, పోలయ్య, డేవిడ్‌పాల్, సాల్మన్‌రాజు, జీవన్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘస్తులు, పాస్టర్లు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అంకభూపాలపురంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదన్నారు. 1వ తేది సెలవు వస్తే ఒరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, తహసీల్దారు అబ్దుల్‌అమీద్, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ శ్రీనివాసులు, చెంచు శ్రీనివాసులు, బక్కమంతుల మా ల్యాద్రి, ప్రగడ మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మండలంలోని పోకూరులో గ్రామ సచివాలయాన్ని మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టరులను పరిశీలించారు. అధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుష్మకు మెమో జారీ చేయాలని ఎంపీడీవో నరేంద్రదేవ్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమయపాలన పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకరావాలని చెప్పారు.



అంకభూపాలపురంలో దివ్యాంగుడికి పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ప్రొఫెసర్ శైలజకు ఉగాది పురస్కారం

కావలిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యు కావలి పీజీ కళాశాల జీవశాస్త్ర సహ ఆచార్యులు వీశైలజకు ఉగాది పురస్కారం లభించింది. శైలజ జీవశాస్త్రంలో అనేక పుస్తకాలు, జర్నల్స్ రచించడం, అనేక జాతీయ స్థాయి పరిశోధనా పత్రాలు సమర్పించి అవార్డులు పొందడంతో జీవన యాగశాల ఆరోగ్య ట్రస్ట్‌వారు సోమవారం రాత్రి నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా ఆమెను ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. ట్రస్ట్ చైర్మన్ ఎం.ప్రసన్నకుమార్, రామాయణం మహేష్‌స్వామి, లలితా భరద్వాజ దత్త పీఠాధి పతులు ఆమెను అభినందించారు. మంగళవారం కళాశాలలో డాక్టర్ శైలజను ప్రిన్సిపాల్ వీరారెడ్డి, ఆచార్యులు, సిబ్బంది అభినందించారు.



ఉగాది పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ శైలజ

బ్యాంకులు సర్‌చార్జీలు రద్దు చేయాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకులు సర్‌చార్జీలు రద్దు చేసి చేసి దోపిడీని అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలకు మించి ఏటీఎంలలో లావాదేవీలు జరిపితే రూ.50లు కట్ చేస్తున్నారన్నారు. ఏడాదిపాటు లావాదేవీలు జరుగకపోయినా, బ్యాంక్ ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోయినా డబ్బులు కట్ చేస్తున్నారన్నారు. పేదవారి దగ్గర సర్‌చార్జీల పేరుతో వసూళ్లు చేసి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇస్తుండటంతో వారు బ్యాంక్‌లకు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, నాగబోయిన భాస్కర్, ఎం.లక్ష్మీనర్సు, జెడ్డా వాసు, ఆలూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నేతలు



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

తడి,పొడి చెత్తను క్లాప్‌మిత్రలకు ఇవ్వండి

లింగసముద్రం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్లలోని తడి పొడి చెత్తను వేర్వేరుగా క్లాప్‌మిత్రలకు ఇవ్వాలని ఎంపీడీవో కె శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం మండలంలోని చినపవనిలో ఆయన ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని, గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 11 గంటలకు వరకు చేయాలన్నారు. అలాగే పని ప్రదేశంలోనే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రషీద్‌బాషా, పంచాయతీ కోఆర్డినేటర్ రాజేష్ కూడా ఉన్నారు.

రేపటి నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

కావలి రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 3వ తేదీ నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలీసెట్‌కు హా.రయ్యే విద్యార్థుల కోసం కావలి పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాలలో, రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత మెటీరియల్ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9949022772, 9966797981లను సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిట్రగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కావలి అంబేడ్కర్ నగర్‌కు చెందిన పచ్చా పార్థసారధి(39) గత నెల 25వ తేదీన రాత్రి మోటారుసైకిల్‌పై బోగోలుకు వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో అంబేడ్కర్ కాలనీ సమీపంలో స్పీడ్ బ్రేక్ వద్ద అదుపు తప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కోటేశ్వరావు తెలిపారు.



మృతి చెందిన పార్థసారధి

'పశు బీమా' తగ్గింది

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంతోపాటు పాడిపరిశ్రమకు ఎంతో ప్రాధాన్యతనిస్తోంది.. ఇప్పటికే ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకు రాగా తాజాగా పశుబీమా పథకంలో కొన్ని మార్పులు చేసింది. ప్రీమియం చెల్లింపుల్లో రైతు వాటాను మరో 5శాతం తగ్గిస్తూ ఉత్తర్వులిచ్చింది. కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమకు ఇస్తున్న ప్రాధాన్యంతో గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాడికి దూరమైన రైతులు తిరిగి పాడి రంగంపై దృష్టి సారిస్తున్నారు.

- ప్రీమియం చెల్లింపుల్లో మార్పులు
- రైతు వాటా 5 శాతం తగ్గించిన ప్రభుత్వం



నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమలో జాతిని బట్టి పశువుల విలువ ఉంటుంది. అయితే వివిధ కారణాలతో పశువులు మరణిస్తే వాటి పోషకులు నష్టపోతారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేసింది. దీన్ని పొందేందుకు రైతు వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయి. ఈ పథకంలో నమోదైన రైతులకు సంబంధించిన పశువులు చనిపోతే సదరు రైతుకు బీమా నగదు రూపంలో ఆర్థికంగా కొంత ఉపశమనం లభిస్తుంది. తాజాగా రైతు వాటా కింద చెల్లించే 20 శాతంలో మరో 5శాతం తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● వైసీపీ పాలనలో కాలయాపన

వైసీపీ ప్రభుత్వంలో పశువులు చనిపోతే వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం ద్వారా పాడి రైతులకు పరిహారం అందిస్తామని పెద్దఎత్తున ప్రకటనలు గుప్పించారు. మొదటి ఏడాది మాత్రం పరిహారం అందించినా ఆ తరువాత నాలుగేళ్లు ఎలాంటి పరిహారం చెల్లించలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మరుగున పడిపోయిన పాత బకాయిలను సైతం చెల్లించడమేకాక పశుబీమా పథకాన్ని పునః ప్రారంభించింది.

● 5శాతం తగ్గింపు

పశుబీమా పథకంలో దారిద్రరేఖకు దిగువన ఉన్న ఎస్సీ ఎస్టీ రైతులకు 80శాతం ప్రీమియం రాయితీతో నాటు పశువులకు రూ.15వేలు, మేలు జాతి పశువులకు రూ.30వేల వరకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. మూడేళ్ల వ్యవధికి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించేందుకు రాయితీ అందించింది. రూ.768ల నుంచి రూ.1536లు వరకు ప్రభుత్వం రాయితీ అందించగా రూ.192ల నుంచి రూ.384ల వరకు లబ్ధిదారుని వాటాగా ఉంది. తాజాగా రైతు వాటాను మరో 5 శాతం తగ్గించింది. దీనికి అనుగుణంగా రూ.816ల నుంచి రూ.1632లు ప్రభుత్వం రాయితీ ఇవ్వగా, రూ.144 నుంచి రూ.288ల వరకు లబ్ధిదారుని వాటా తగ్గింది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న రైతులకు రూ.480 నుంచి రూ.960ల వరకు అంటే 50శాతం రాయితీ అందిస్తోంది. ఇందులో ఎలాంటి మార్పులు చేయలేదు.

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

పశుబీమా పథకంలో రైతు ప్రీమియం వాటా 5 శాతం తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాడి పశువులు, మేకలు, గొర్రెలు, పందుల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశువులకు మూడేళ్లపాటు బీమా వర్తిస్తుంది. మేకలు, గొర్రెలు, పందులకు వాటి పెంపకందారులకున్న అవకాశాన్ని బట్టి ఏడాది నుంచి మూడేళ్లపాటు బీమా చెల్లింపులు చేసుకోవచ్చు.

- రమేష్‌నాయక్, పశుసంవర్ధకశాఖ జేడీ



మద్యం మత్తులో స్నేహితుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన అన్నదమ్ములపై దర్గామిట్ట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఖుద్దూస్ నగర్‌కు చెందిన ఆసీఫ్ బంగారు పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా స్నేహితులు తాహీర్, మస్తాన్, సయ్యద్, అజ్‌గర్, హమీద్, అహ్మద్, యస్దాని, సాబీర్, షఫి తదితరులతో కలిసి మాగుంట లేవుట్‌లోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. స్నేహితులందరూ మద్యం సేవిస్తుండగా ఆసీఫ్ కూర్చొని వారితో మాట్లాడసాగాడు. స్నేహి తుడు సాబీర్ మద్యం మత్తులో ఆసీఫ్‌తో గొడవపడ్డాడు. అనంతరం ఆసీఫ్ లాడ్జీ నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో సాబీర్ అన్న షఫి ఆసీఫ్‌ను అడ్డుకొని తన వద్ద ఉన్న కత్తితో పొట్టలో గట్టిగా పొడిచాడు. సాబీర్ సైతం ఇంకా పొడువు అంటూ అన్నను ప్రోత్సహించాడు. అక్కడకు చేరుకున్న స్నేహితులు అన్నదమ్ములను అడ్డుకొని గాయాలపాలైన ఆసీఫ్ ను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడు ఆసీఫ్ మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రమేష్‌బాబు నిందితులు షఫి, సాబీర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదాల నివారణకు సిద్ధం

- అగ్నిమాపక యంత్రాలన్నీ ఫిట్!
- వేసవిలో సిబ్బందికి సెలవుల రద్దు
- 14 నుంచి అవగాహన సదస్సులు
- ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసులురెడ్డి

ఈసారి ఎండలు మండిపోనున్నాయి. గతంతో పోలిస్తే రానున్న మూడు నెలల్లో ప్రచండుడు నిప్పులు కురిపించనున్నాడు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలు కూడా ఎక్కువగా సంభవించే అవకాశం ఉంటుంది. కాబట్టి చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

● అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కొంటారు



వేసవి ప్రారంభం కావడంతో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉన్నాము. ఇప్పటికే సిబ్బందికి సెలవులు రద్దు చేశాము. స్టేషన్ పరిధిలో ఉన్న ఫైర్ ఇంజన్‌లతో పాటు, మంటలను ఆర్పేందుకు వినియోగించే పరికరాలు కండీషన్‌లో ఉన్నాయా!? లేవా!? అని అధికారులు పరిశీలించారు. ఏవైనా మొరాయించి ఉంటే వెంటనే మరమ్మతు చేయించారు. అనుకోని ఉపద్రవం వస్తే ఎదుర్కొనేందుకు మా శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది.

● ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా

అగ్నిప్రమాదాలపై పోలీసు, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. వేసవి కాలంలో అధికంగా వచ్చే వడదెబ్బలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. ఈ నెల 14వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని ప్రజలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, వైద్యశాలలు, లాడ్జీలు, హోటళ్లు, షాపింగ్‌మాల్స్ ఇలా వ్యాపార సంస్థలలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాము. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది వినియోగించే పరికరాల గురించి ప్రజలకు వివరిస్తాము.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవీ

వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి ఊళ్లకు వెళ్లే వారు గ్యాస్‌ను రెగ్యులేటర్ వద్ద ఆపుకోవాలి. విద్యుదాఘాతం జరగకుండా మెయిన్ ఆఫ్ చేయాలి. వేసవిలో ఏసీలు అధికంగా వినియోగిస్తుంటారు. మనం వినియోగించే కరెంట్‌ను బట్టి ఇంట్లో వైరింగ్ ఉందా లేదా అని పరిశీలించుకోవాలి. ఇక పల్లెల్లో గడ్డివాములు దగ్ధంకావడానికి బాణాసంచా, సిగిరెట్లు, బీడీలు తాగి ఆర్పకుండా విసిరేయడం వంటివి ప్రధాన కారణాలు. ఆదిలేనే మంటలను ఆర్పివేస్తే గడ్డి వాములు పూర్తిగా దగ్ధం కావు. అందుకే గడ్డివాములు వేసుకునే వారు ఒక్కో గడ్డి వాముకు 30 మీటర్లు దూరం ఉండేలా చూడాలి. మూడు డ్రమ్ములలో నీటిని నింపుకోవాలి. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక శాఖకు ఫిర్యాదు చేయాలి.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

నేడు టెన్నిస్‌బాల్ క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి అజయ్‌కు మార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాతి పదికన అండర్-19 బాల, బాలికల జట్లు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా పేడు గురాళ్లలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే 12వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశా లలో 2025- 26 విద్యా సంవత్సరానికి ప్రవేశా లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ జీ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు (అక్క చెరువుపాడు), గండిపాళెం, తుమ్మలపెంట, ఆత్మకూరులో 5వ తరగతి, 6, 7, 8 తగరతుల్లో మిగిలిన ఉన్న సీట్లలో ప్రవేశం కోసం అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు గడువును ఈ నెల 6 వరకు ప్రభుత్వం పొడి గించిందని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25వతేదీ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

20 నుంచి రజకుల రాష్ట్ర మహాసభలు

- రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంకయ్య

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి) : రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 20, 21 తేదీల్లో కొండపల్లిలో జరుగుతా యని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య తెలి పారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం నేరేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. అంకయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారులు చేసే పోరాటాలకు అందరూ మద్దతు తెలపాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడు తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వెంటనే నిధులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు కొత్తకోట వెంకటేశ్వర్లు, కంచర్ల సాయి. దేవరకొండ వెంకటేశ్వర్లు, సుధాకర్, సురభి శ్రీనివాసులు, పందేటి సురేంద్ర, గోనిల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం దుంగల పట్టివేత



పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో అటవీ శాఖ అధికారులు

రాపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఉదయం తనిఖీల్లో భాగంగా మినీవ్యానులో ఎండుగడ్డి కింద దాచి ఉన్న ఎర్రచందనం దుంగలు బయట పడ్డాయి. వాటిని అటవీ అధికారులు స్వాధీనం చేసున్నారు. రాపూరు రేంజర్ రవీంద్రబాబు కథనం మేరకు వివరాలు... తనిఖీలలో భాగంగా మద్దెలమడుగు చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఉదయం గడ్డి లోడుతో ఉన్న మినీ వ్యానును చెక్‌పోస్ట్ సిబ్బంది ఆపారు. కానీ ఆ వాహ నం రాపూరు నుంచి వెంకట గిరి వైపు ఆగకుండా వేగంగా వెళ్లిపో యింది. అటవీశాఖ అధికా రులు దాన్ని వెంబడించడంతో, డ్రైవర్ వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యాడు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణా బండారం బయటపడింది. 1200 కేజీల బరువైన 89 దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 15 లక్షల వరకూ ఉంటుందని రవీంద్రబాబు తెలిపారు. అనంతరం వాహనాన్ని సీజ్ చేశారు. ఎర్రచందనాన్ని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన రాపూరు రేంజ్ అటవీ అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులను జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా అభినందించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తోంది. ఏర్పాటయ్యే కమిటీలో చోటు లభిస్తుందని ఆశావహులు ఎదురుచూశారు. అయితే, వీరి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా గ్రంథాలయాలకు పర్సన్ ఇన్‌చార్జులుగా జాయింట్ కలెక్టర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లా గ్రంథాలయ సంస్థకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ కార్తీక్‌కి బాధ్యతలు అప్పగించనున్నారు. మరోవైపు జిల్లా గ్రంథాలయ సంస్థ సమస్యల్లో కూరుకుపోయి ఉంది. నగరవాసులకు నూతన గ్రంథాలయ భవనం కలగానే మిగిలింది. ఆరేళ్లుగా కొత్త భవన నిర్మాణం నత్తనడకను తలపిస్తోంది. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు రూ.49కోట్లకుపైగా పేరుకుపోయింది. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పింఛనుదారులకు రెండు నెలలుగా జీతాలు, పింఛన్లు అందక అవస్థలు పడుతున్నారు. రాక ఆకలి బాధల్లో ఉన్నారు. పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించే జాయింట్ కలెక్టర్ అయినా గ్రంథాలయ సంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తారన్న ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గిరిజన యువకుడి మృతి



మృతుడు దండిపూడి వెంకటేష్ అలియాస్ దానియేల్

అల్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మంగళ వారం ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. వాకాడు మండలం నిమ్మవానితిప్పకు చెందిన దండిపూడి వెంకటేష్ అలియాస్ దానియేల్ (27) గత ఏడాది కాలంగా అల్లూరులోని క్రిస్టియన్‌పేటలో తన భార్య పావనితో కలసి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మార్చి 31వ తేదీ మధ్యాహ్నం పావని తన బంధువుల కుటుంబంలో శుభకార్యం ఉండగా తన భర్త స్వగ్రామానికి వెళ్లింది. అదేరోజు రాత్రి వెంకటేష్ అన్న దండిపూడి మోషే తన సోదరుడితో ఫోనులో కాసేపు మాట్లాడాడు. మంగళవారం ఉదయం 8 గంటలకు మోషే తన సోదరుడు వెంకటేష్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కారణం తెలియకపోవడంతో తమ బంధువులైన అల్లూరు పట్టణ పరిధిలోని ఉద్దీపగుంటలోని అమర్ అనే వ్యక్తికి ఫోన్ చేసి తన సోదరుడి వద్దకు వెళ్లి ఫోన్ చేయించమని కోరాడు. దీంతో అమర్ వెంకటేష్ ఇంటికి వెళ్లి చూడగా వెంకటేష్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఎంత ప్రయత్నించినా లేవకపోవడంతో ఆ విషయాన్ని మోషేకు తెలిపాడు. దీంతో కంగారుపడిన మోషే అల్లూరుకు చేరుకొని చూడగా అప్పటికే వెంకటేష్ మృతి చెంది ఉన్నాడు. పక్కనే మద్యం సీసాలు పడి ఉండడం గమనించిన మోషే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ కిషోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన భర్త మృతి చెందడాన్ని జీర్ణించుకోలేని భార్య రోదన స్థానికులను కలచివేసింది.

మిల్లర్ ప్రమాదంలో మహిళ మృతి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీ ప్రమాదవశాత్తు మిల్లర్‌లో ఇరుక్కుని మృతి చెందిన ఘటన మండలంలోని కళవళ్లలో మంగళవారం జరిగింది. వివరాల మేరకు.. కళవళ్లకు చెందిన వ్యవసాయ కూలీ వచ్చవ పుల్లమ్మ (46) శనగపంట కట్టెను నూర్పిడి పనులకు వెళ్లింది. కట్టెను మిల్లర్‌లో వేస్తుండగా పుల్లమ్మ తలకు చుట్టుకున్న కండువా మిల్లర్‌కు చుట్టుకోవడంతో పుల్లమ్మ తలకు తీవ్ర గాయమై మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు.

రూ. 2.58కోట్లతో 964 నీటితొట్టెల మంజూరు

- డ్వామా పీడీ గంగాభవాని

మనుబోలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామి పథకం కింద రూ. 2.58కోట్లతో 964నీటితొట్టెలు మంజూరయ్యాయని డ్వామా పీడీ గంగా భవాని తెలి పారు. మండలంలోని జట్లకొండూరులో మంగళవారం నీటితొట్టె పనులను ఆమె పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ. 30వేలు ఇస్తారన్నారు. వీటిని వారంలో పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలో 11 పంచాయ తీల్లో 27 నీటితొట్టెలు ఏర్పాటు చేయించాలన్నారు. అలాగే జిల్లాకు వర్షపునీటిగుంతలు 7500తవ్వించాలని ఆదేశించారన్నారు. మొదటివిడతగా 2500గుంతలు సెప్టెంబరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. వేసవిలో పనిచేసే ఉపాధి కూలీల కోసం మంచినీరు,షెడ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని ఆదేశించారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా తగిన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏపీవో రాజమ్మ, టీఏలు సుప్రజ, గుర్రప్ప, టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న రైతు



ఆత్మకూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నవాడ గ్రామంలో వెన్నవాడ, గండ్లవీడు మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, తమ పొలంలో రోడ్డు వేయడాన్ని నిరసిస్తూ రైతు జగన్నాథం చలమయ్య మంగళవారం అడ్డుకున్నాడు. ఎక్స్‌కవేటర్‌కు అడ్డంగా పడుకున్నాడు. అతనితోపాటు సమీప పొలాల్లోని రైతులు తమ పొలాల్లో రోడ్డు వేయడానికి వీలు లేదని తరలి రావడంతో పని నిలిపివేసి ఎక్స్‌కవేటర్‌తో అక్కడి నుంచి వెనుతిరిగారు. దీంతో రోడ్డు పనులు తాత్కాలికంగా ఆగాయి.

తాగునీటి సరఫరాకు తక్షణ చర్యలు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్

లింగసముద్రం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురం ఎస్సీ కాలనీలో మోటారుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ చెప్పారు. మూడు నెలల క్రితం కాలనీలో డీప్ బోరుకు చెందిన మోటారు మరమ్మతులకు గురైంది. ఈ విషయాన్ని కాలనీ వాసులు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఏఈ రాజశేఖర్ మంగళవారం గ్రామానికి చేరుకుని మోటారును పరిశీలించారు. గ్రామ సర్పంచు మల్లికార్జునతో మాట్లాడి రెండు మూడు రోజుల్లో అవసరమైతే కొత్త మోటారును ఏర్పాటు చేయించి డీప్ బోరు పక్కనే ఉన్న మినీ ట్యాంకులోకి నీటిని సరఫరా చేస్తామని, ఆ ట్యాంకు నుంచి వచ్చే నీటిని కాలనీవాసులు పట్టుకోవాలని చెప్పారు. అయితే తమ కాలనీలోని 40 కుటుంబాలకు ఒక్క చేతి బోరు ఉందని, ప్రస్తుతం కాలనీవాసులకు అదే ఆధారమన్నారు. తమ కాలనీకి గ్రామంలోని ట్యాంకు నుంచి వచ్చే నీరు సరిగా రావని, కొందరు ఈ మంచినీటి పైపులకు మోటార్లు ఏర్పాటు చేసుకొని నీటిని పట్టుకుంటుండడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. దీనిపై కూడా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఆయనను కోరారు.

రేపు రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు లోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం రెజ్లింగ్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్రరావు ఓ ప్రక టనలో పేర్కొన్నారు. గ్రీకురోమన్, ఫ్రీస్టయిల్ విభాగాల్లో 15 నుంచి 20 ఏళ్లలోపు వయసు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే ఎంపికలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాజ మహేంద్రవరంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు .

బంగారంతో వ్యక్తి పరారీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆభరణాలు తయారు చేసేం దుకు ఇచ్చిన బంగారుతో వ్యక్తి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని మండపాలవీధికి చెందిన మోహన్‌లాల్ అరవింద కుమార్ బంగారు ఆభరణాల హోల్‌సేల్ వ్యాపారి. ఆయన పదేళ్లుగా షాకీర్ వద్ద బంగారు ఆభరణాలు తయారు చేయిస్తున్నారు. అరవింద కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఆభరణాల తయారీ కోసం 440 గ్రాముల బంగా రాన్ని షాకీర్‌కు ఇచ్చారు. ఇప్పటి వరకు ఆభరణాలు ఇవ్వకపోగా షాకీర్ కనిపించకుండా పోయాడు. గాలించినా జాడ తెలియక పోవడంతో బాధితు డు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

594 బస్తాల బియ్యం, 20 బస్తాల కందిపప్పు మాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కావలి ఎంఎల్‌ఎస్ పాయింట్ (పౌరసరఫరాల గోదాం) నుంచి 594 బస్తాల రేషన్ బియ్యం, 20 బస్తాల కందిపప్పు మాయం అయినట్లు కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ గుర్తించారు. 'గోదాము నుంచి రేషన్ బియ్యం రైస్ మిల్లర్లకు' అనే శీర్షికతో ఈనెల 28వ తేదీన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డీవో గోదాంను సమగ్రంగా తనిఖీలు చేసి విచారణ చేపట్టినా 594 బస్తాల బియ్యం, 20 బస్తాల కంది పప్పు లెక్కలు తేలలేదు. ఈ మేరకు గోదాం ఇన్‌చార్జిపై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఆర్డీవో మంగళవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పొదుపు నిధుల దుర్వినియోగంపై విచారణ

- డీఆర్‌డీఏ పీడీ



పింఛన్ల పంపిణీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి

రాపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల వెలుగు కార్యాలయంలోని పొదుపు సంఘాల్లో జరిగిన నగదు దుర్వినియోగంపై విచారణ చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. పింఛన్ల పంపిణీలో భాగంగా మంగళవారం ఆమె రాపూరుకు వచ్చారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతిపై స్పందించారు. సుమారు రూ. 1.30 కోట్ల దుర్వినియోగం విషయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడుగురికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వారి వివరణ తరువాత చర్యలు ఉంటాయని తెలిపారు. పెన్షన్లు తెల్లవారుజాము నుంచే పంపిణీ చేస్తున్నామని, పంపిణీ ఎలా జరుగుతుందన్న విషయంపై ఇక్కడ వచ్చామన్నారు. లబ్ధిదారులకు మర్యాద పూర్వకంగా ఇస్తున్నారా, లేదా అనే విషయంపై నేరుగా కొంతమంది ఇళ్లకు వెళ్లి అడిగామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 53.374 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 53.374 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 330, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కండలేరు డ్యాంలో..

రాపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 48.51 టీఎంసీలుగా ఉందని డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1410 క్యూసెక్కులుగా ఉందని అయన తెలిపారు.

బిల్లులు రాగానే పనుల ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలువాయి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి బిల్లులు అందిన వెంటనే పనులు మొదలు పెడతామని, సోమశిల, కండలేరు కాలువ విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులు తెలియపరచినట్లు తెలుగుగంగ ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గత నెల 19న ఆంధ్రజ్యోతిలో 'ఆగిన కండలేరు కాలువ పనులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పనులు మొదట్లో వేగంగా జరిగినా, బిల్లులు సకాలంలో అందకపోవడంతో పనులను తాత్కాలికంగా ఏజెన్సీ వారు నిలిపివేశారని తెలిపారు. ఆ తరువాత కొంత మేరకు బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. ఇంకా సుమారు రూ.14కోట్ల బిల్లులు చెల్లించాల్సిందని తెలిపారు. పనుల విషయమై ఏజెన్సీని సంప్రదించగా బిల్లులు వచ్చాక పనులు మొదలు పెడతామని తెలియజేసినట్లు ఆయన వివరించారు.